




గుంటూరులో డ్రగ్స్ కలకలం

- మస్తాన్ దర్గా ధర్మకర్త తనయుడు మస్తాన్ సాయి అరెస్టు
- ఇప్పటికే గుంటూరుకు చెందిన నలుగురు నిందితుల అరెస్టు
- నిందితుల్లో ఇద్దరు హోటల్ సుభాని తనయులు
- గతంలో అత్యాచారం, హత్యాయత్నం కేసులో సాయి నిందితుడు
- ఈ ముఠాలో కీలకంగా వైసీపీ నేత అన్న కుమారుడు
- గతంలో కేసుల నుంచి తప్పించుకున్న వైనం

గుంటూరు, ఆగస్టు 12 : గుంటూరు కేంద్రంగా డ్రగ్స్ కలకలం.. వైసీపీ ప్రభుత్వ హయాంలో గుంటూరుకు చెందిన ఈ ముఠా అత్యంత కీలకంగా వ్యవహరించింది. గుంటూరుకు చెందిన కొందరు ఓ ముఠాగా ఏర్పడి పెద్ద ఎత్తున డ్రగ్స్‌ను గోవా, బెంగళూరు తదితర ఇతర ప్రాంతాల నుంచి తెప్పించి విక్రయించారు. ఈ ముఠాకు వైసీపీ మాజీ ప్రజా ప్రతినిధి అన్న కుమారుడు నాయకుడు కావడం గమనార్హం. గతంలో ఎన్నిసార్లు పట్టుబడినా కేసులో వారి పేర్లు లేకుండా అప్పట్లో వైసీపీ ప్రజా ప్రతినిధి తన పలుకుబడి ఉపయోగించి వ్యవహారం నడుపుతూ రావడంతో ఈ డ్రగ్స్ ముఠా మరింతగా రెచ్చిపోయింది. తాజాగా సోమవారం తెల్లవారుజామున మస్తాన్ దర్గాలో ఆశ్రయం పొందుతున్న మస్తాన్ దర్గా ధర్మకర్త రావి రామ్మోహన రావు తనయుడు రావి మస్తాన్ సాయిని విజయవాడ సెబ్ పోలీసులు అరెస్టు చేసి తీసుకు వెళ్లారు. జూన్ 30న విజయవాడ స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్‌బ్యూరో (సెబ్) పోలీసులకు అందిన పక్కా సమాచారంతో విజయవాడ రైల్వేస్టేషన్లో దాడి చేయగా గుంటూరులోని సుభాని హోటల్ నిర్వాహకుడు దివంగత సుభాని తనయులు షేక్ నాగుల్ షరీఫ్, ఖాజా మొహిద్దీన్ తోపాటు వారి స్నేహితులు గోపీచంద్, క్రాంతి తదితరులు పట్టుబడ్డారు. వారిని విచారించగా తమకు మస్తాన్ సాయి డ్రగ్స్ సరఫరా చేస్తున్నట్లు వెల్లడించారు. దీంతో పోలీసులు అప్పటి నుంచి మస్తాన్ సాయి కోసం వెంటాడుతుండగా ఎవరికి దొరక్కుండా తప్పించుకు తిరుగుతున్నాడు. అయితే మస్తాన్ సాయి గుంటూరులోని మస్తాన్ దర్గాలో ఉన్నట్లు పక్కా సమాచారం అందుకున్న విజయవాడ పోలీసులు సోమవారం మస్తాన్ దర్గాలో ఉన్న మస్తాన్ సాయిని అరెస్ట్ చేశారు. డ్రగ్స్ కేసులో మస్తాన్ సాయిని అరెస్టు చేయడంతో గుంటూరులో డ్రగ్స్ వ్యవహారం మరోసారి కలకలం రేపింది. ఎన్నో సంవత్సరాలుగా మస్తాన్ సాయిపై డ్రగ్స్ ఆరోపణలు ఉన్నాయి.

సాయిపై గతంలో పలు కేసులు

గడిచిన కొంతకాలంగా తెలుగు రాష్ట్రాల్లో తీవ్ర దుమారం రేపిన సినీ నటుడు రాజ్ తరుణ్, లావణ్య కేసులోనూ మస్తాన్ సాయి పేరు వినిపించింది. గుంటూరులోని పట్టాభిపురం పోలీస్ స్టేషన్ పరిధిలోని ఓ హోటల్లో మస్తాన్ సాయి తనపై అత్యాచారం చేసి హత్యాయత్నానికి పాల్పడ్డాడు అంటూ అప్పట్లో లావణ్య ఫిర్యాదు చేశారు. ఆమె ఫిర్యాదుపై పట్టాభిపురం పోలీస్ స్టేషన్ లో ఐపిసి 376 (1), 307, 323, 506,509 తదితర సెక్షన్ కింద క్రైమ్ నెంబర్ 103/23 గా కేసు నమోదు చేశారు. అయితే ఆ కేసులో అప్పటి సీఐ రాజశేఖర్‌రెడ్డి నిందితుడు మస్తాన్ సాయికి అనుకూలంగా వ్యవహరిస్తున్నట్లు ఆరోపణలు రావడంతో అప్పట్లో కేసును నగరంపాలెం పోలీస్ స్టేషన్‌కు బదిలీ చేశారు. ఆ కేసులో మస్తాన్ సాయి హైకోర్టు నుంచి ముందస్తు బెయిల్ తెచ్చుకున్నారు. కేసు విచారణలో భాగంగా వైద్య పరీక్షలకు రావాల్సిందిగా అప్పటి నగరంపాలెం సీఐ హైమారావు బాధితురాలు లావణ్య కు ఫోన్ చేసి పిలిచినా ఆమె రాలేదు. గుంటూరు పోలీసులు మస్తాన్ సాయికి అనుకూలంగా వ్యవహరిస్తున్నారంటూ ఆమె విచారణకు గైర్హాజరయ్యారు. ప్రస్తుతం ఆ కేసు విచారణ పెండింగ్‌లో ఉంది. ఇది ఇలా ఉంటే గుంటూరులో మస్తాన్ సాయిపై ఫిర్యాదు చేసిన లావణ్య ఆ తర్వాత కొద్ది నెలలకు హైదరాబాదులో డ్రగ్స్ కేసులో పట్టుబడింది. ఆమెకు డ్రగ్స్ సరఫరా చేసింది మస్తాన్ సాయిగా ఆరోపణలు వచ్చాయి.

గతంలోనే డ్రగ్స్ కేసులో వినిపించిన పేరు

ఇదిలా ఉంటే గుంటూరుకు చెందిన వరలక్ష్మి టిఫిన్స్ నిర్వాహకుడు ప్రభాకర్ రెడ్డి హైదరాబాదులో టిఫిన్స్ నిర్వహిస్తూ డ్రగ్స్ వినియోగిస్తూ సరఫరా చేస్తుండగా హైదరాబాదులో పోలీసులు అరెస్ట్ చేశారు. అయితే ఆ కేసులోనూ మస్తాన్ సాయి ఉన్నట్లు ఆరోపణలు వచ్చినప్పటికీ ఆ కేసులో మస్తాన్ సాయిని నిందితునిగా చేర్చకపోవడం పట్ల కూడా అప్పట్లో అనేక అనుమానాలు వ్యక్తం అయ్యాయి. ఇదిలా ఉంటే గుంటూరుకు చెందిన వైసీపీ మాజీ ప్రజా ప్రతినిధి అన్న కుమారుడు, హోటల్ సుభాని తనయులు, ప్రస్తుతం విజయవాడ సెబ్ పోలీసులు అరెస్ట్ చేసిన మస్తాన్ సాయి, హైదరాబాదులో పట్టుబడిన వరలక్ష్మి టిఫిన్స్ నిర్వాహకుడు ప్రభాకర్‌రెడ్డి అందరూ ఒక ముఠాగా ఏర్పడి డ్రగ్స్ సరఫరా చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. గత ప్రభుత్వ హయాంలో వైసిపి ప్రజాప్రతినిధి అన్న కుమారుడు గోవా నుంచి డ్రగ్స్ తెప్పిస్తుండగా పోలీస్ ఉన్నతాధికారులకు పక్కా సమాచారం అందడంతో ప్రకాశం జిల్లా మార్టూరు పరిధిలోని టోల్‌గేటు వద్ద ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులో తనిఖీలు నిర్వ హించగా ఎండిఎంఎ డ్రగ్ తో యువకుడు పట్టుబడ్డాడు. అతని విచారించగా వైసీపీ ప్రజాప్రతినిధి అన్న కుమారుడి పేరు చెప్పాడు. అయితే పోలీ సులు ఆయనను పిలిపించి విచారించారు. అధికార పార్టీ నాయకుడి కుటుంబ సభ్యు లు కావడంతో వారి ఒత్తిడి మేరకు అప్పటి అధికారులు వారిని కేసు నుంచి తప్పించిన ట్లు ఆరోపణలు వచ్చాయి. ఇవేగాక గుం టూరు నగరంలో డ్రగ్స్‌తో కొందరు పట్టు బడగా వారిని విచారించినప్పుడు మాజీ ప్రజాప్రతినిధి అన్న కుమారుడి పేరు కూడా విచారణలో వెలు గు చూసింది. ఆ కేసులోనూ అతడి పేరు తప్పించడంతో ఈ వ్యవహారం పెద్ద దుమారమే రేపింది. దీంతో అప్పటి లాలాపేట సిఐ మాతంగీ శ్రీనివాసరావును ఆకస్మికంగా బదిలీ చేశారు.



మస్తాన్ సాయి

ప్రముఖుని ఫిర్యాదుతో పోలీసుల నిఘా

హోటల్ సుభాని కుమారులు విజయవాడ సమీపంలోని ప్రముఖ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులకు డ్రగ్స్ సరఫరా చేస్తున్నట్లు ఆరోపణలు వచ్చాయి. విశాఖపట్నం చెందిన ప్రముఖుని తనయుడు కూడా వీరి వద్ద డ్రగ్స్ తీసుకొని మత్తులో పడి పోవడంతో, ఫోన్ కూడా రిసీవ్ చేసుకోలేని పరిస్థితిలో ఉండడంతో సమాచారం అందుకున్న ఆయన ఇక్కడికి వచ్చి తన కుమారుని ఆసుపత్రికి తరలించి విచారించగా గుంటూరుకు చెందిన సుభాని తనయుడు డ్రగ్స్ సరఫరా చేస్తున్నట్లు చెప్పాడు. దీంతో పోలీసులు వీరిపై నిఘా ఉంచడంతోనే మార్టూరు వద్ద వీరికి డ్రగ్స్ పట్టు పడినట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో ఇప్పటివరకు వీరు గుంటూరుకు చెందిన ఎంతమందికి డ్రగ్స్ అందించారనేది చర్చనీయాంశమైంది. పోలీస్ ఉన్నతాధికారులు మరింత లోతుగా విచారిస్తే డ్రగ్స్ మాఫియా గుట్టురట్టు అవుతుందని భావిస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో డ్రగ్స్ , గంజాయి వంటి వాటిని యథేచ్ఛగా సరఫరా చేసినా నాటి ప్రజా ప్రతినిధి అధికారాన్ని అడ్డుపెట్టుకొని పోలీసులు కేసులు పెట్టకుండా చూడగలిగారు. ఈ కారణంగానే డ్రగ్స్ మాఫియా రెచ్చిపోయింది. ఈ ముఠా కార్యకలాపాలపై ఇప్పటికైనా పోలీసు ఉన్నతాధికా మూలాలను కూకటివేళ్ళతో పెకిలించి వేయాలని ప్రజలు కోరుతున్నారు.

బడి నడిపేదెలా..

- విద్యా సంవత్సరం ప్రారంభమైనా విడుదల కాని స్కూల్ గ్రాంట్
- వైసీపీ ప్రభుత్వంలో మూడేళ్లగా నిధులు విడుదల జీరో

గుంటూరు(విద్య),ఆగస్టు 12: ప్రభుత్వ పాఠశాలలు పునః ప్రారంభమై మూడు నెలలు పూర్తికావస్తున్నా నిధులు విడుదలతో తీవ్రజాప్యం జరుగుతోందని ప్రధానోపాధ్యాయులు(హెచ్‌ఎంలు) ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నిధుల లేమి కారణంగా ఇప్పటికే మూడు నెలలుగా పారిశుధ్య కార్మికులకు, మధ్యాహ్నభోజన కార్మికుల జీతాలు నిలిచిపోవడంతో పాఠశాలల్లో తీవ్ర ఆందోళన నెలకొంది. మరోవైపు పాఠశాలల్లోరోజువారీ ఖర్చుల కోసం నిధులు లేకపోవడంతో హెచ్‌ఎంలు సొంత డబ్బులు వినియోగించాల్సి వస్తోంది.

ఉమ్మడి జిల్లాలో జడ్పీ, ప్రభుత్వ యాజమాన్యాల ఆధ్వర్యంలో 340పైగా ఉన్నత పాఠశాలలు, మరో 3500 వరకు ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలు ఉన్నాయి. ఆయా పాఠశాలల్లో దాదాపు 4.50లక్షల మందికిపైగా విద్యార్థులు 1 నుంచి 10వ తరగతి వరకు విద్యను అభ్యసిస్తున్నారు. ఏటా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్త ఆధ్వర్యంలో స్కూల్ గ్రాంట్స్ విడుదల చేస్తారు. కేంద్రం నుంచి ఏటా జూలై మొదటి వారంలోనే నిధులు వస్తాయని వాటికి రాష్ట్ర ప్రభుత్వం కొంతమొత్తం నిధులు జోడించి స్కూల్‌గ్రాంట్‌గా విడుదల చేస్తారు. అయితే వైసీపీ ప్రభుత్వంలో మొదటి రెండు సంవత్సరాలు మాత్రమే నిధులు ఇచ్చారని మిగిలిన మూడు సంవత్సరాలు నిధులు నిలిపివేయడంతో హెచ్‌ఎంలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

నిధులు విడుదల, వినియోగం ఇలా..

ప్రభుత్వం స్కూల్ గ్రాంట్ కింద విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా నిధులు విడుదల చేస్తారు. విద్యార్థులు 100 లోపు ఉంటే రూ.25వేలు, 100 నుంచి 500 లోపు అయితే రూ.50వేలు, 1000లోపు ఉంటే రూ. లక్ష ఇలా విద్యార్థుల సంఖ్య కనుగుణంగా గ్రాంట్స్ విడుదల చేస్తారు. ఈ నిధులతో పాఠశాలలో ఎలక్ట్రికల్ బిల్లు, చాక్‌పీసులు, స్టేషనరీ, మంచి నీరు, కంప్యూటర్ల నిర్వహణ, మోటార్ ఖర్చులు మరుగుదొడ్ల నిర్వహణ, చిన్న చిన్న ఫంక్షన్ల కోసం వినియోగిస్తారు.

- జాతీయ విద్యా విధానం ప్రవేశ పెట్టి నాలుగేళ్ళు అయిన సందర్భంగా చేసిన ఖర్చులకు డబ్బులు లేక ఇబ్బందులు ఎదురయ్యాయి.



దాతల సహకారంతో తిథి భోజనం నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు (పాతచిత్రం)

- ఇటీవల పాఠశాలల్లో శిక్షా సప్తాహ్ కార్యక్రమాలు వారం రోజులు నిర్వహించారు. ఇందు కోసం ఒక్కపైసా ప్రభుత్వం నుంచి విడుదల కాలేదు. దీంతో హెచ్‌ఎంలు దాతల్ని ఆశ్రయించాల్సి వచ్చింది. కొన్ని స్కూల్స్‌లో విద్యార్థుల తల్లిదండ్రులు చందాలు వేసుకుని నిర్వహించగా కొన్నిచోట్ల విద్యార్థుల నుంచి కొంత మొత్తం వసూలు చేసి వారం రోజులు కార్యక్రమాలు చేశారు.
- ఈనెల మొదటి వారంలో నిర్వహించిన స్కూల్ మేనేజమెంట్ కమిటీ ఎన్నికలకు నిధులు లేవు. పాఠశాలకు వచ్చిన తల్లిదండ్రులకు అల్పాహారం, కాఫీ, టి, బిస్కెట్ల హెచ్‌ఎంలు సొంత నిధులు ఖర్చుపెట్టాల్సిన దుస్థితినెలకొంది.
- 15న స్వాతంత్ర్య వేడుకలు నిర్వహించాలి. ఇందుకోసం నిధులు వెతుక్కోవాల్సిన దుస్థితి పాఠశాలల్లో నెలకొంది.
- జిల్లాలో మధ్యాహ్నభోజన పథకం అములు చేసే నిర్వాహకులకు మూడు నెలలుగా నిధులు విడుదల కాలేదు. దీంతో అనేక చోట్ల ఏజెన్సీ నిర్వాహకులు తీవ్రస్థాయిలో హెచ్‌ఎంలపై ఆగ్రహంగా ఉన్నారు. మరోవైపు మరుగుదొడ్లు, పాఠశాలల్లో పారిశుధ్య పనులు చేసే కార్మికులకు మూడు నెలలుగా జీతాలు లేవు.దీంతో కొన్ని చోట్లు పారిశుధ్యం అస్తవ్యస్తంగా మారిందని హెచ్‌ఎంలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఎన్డీఏ ప్రభుత్వం పాఠశాలలకు గ్రాంట్ విడుదల చేయాలని, ప్రభుత్వ ఉత్తర్వుల కోసం ఎదురు చూస్తున్నామని హెచ్‌ఎంలు చెబుతున్నారు.



కడవకుదురు సరిహద్దులో ఓ క్వారీలో ఎక్స్‌కవేటర్‌తో నింపుతున్న ఇసుక



ఓ క్వారీ నుంచి పరదా కప్పి తరలిపోతున్న ఇసుక ట్రాక్టరు

ఆగని ఇసుక అక్రమ రవాణా

- ఏకంగా ఎక్స్‌వేటర్లతో తవ్వకాలు
- అధికారుల్లో లేని చలనం

చీరాల, ఆగస్టు 12 : చీరాల నియోజకవర్గంలో పలుచోట్ల, పర్చూరు నియోజకర్గం చినగంజాం మండలం కడవకుదురు పరిధిలో ఇసుక అక్రమ రవాణా యథేచ్ఛగా సాగుతోంది. ఈ వ్యవహారం బహిరంగంగా సాగుతున్నా, దీనిని నియంత్రించాల్సిన శాఖల అధికారులకు మాత్రం కనిపించడం లేదు. ప్రభుత్వం ఉచిత ఇసుక విధానాన్ని ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది. సీఎం చంద్రబాబు ఇసుక అక్రమాలు జరగకూడదని పదే, పదే చెప్తున్నారు. ఇటీవల ఐఏఎస్, ఐపీఎస్‌లకు నిర్వహించిన సమావేశంలో కూడా ఇసుక అంశాన్ని సీఎం ప్రత్యేకంగా ప్రస్తావించారు. అయితే క్షేత్ర స్థాయిలో అధికారులు అక్రమార్కులతో మిలాఖత్ అవడంతో, పగలు, రాత్రి తేడాలేకుండా ఇసుక అక్రమ రవాణా సాగుతోందనే విమర్శలు వినిపిస్తున్నాయి.

పోలీస్ స్టేషన్‌కు కూతవేటు దూరంలో..

చీరాల మండలం ఈపూరుపాలెం పోలీస్‌స్టేషన్‌కు కూతవేటు దూరంలో 216 జాతీయ రహదారికి సమీపంలో ఏకంగా ఎక్స్‌కవేటర్‌తో ఇసుక అక్రమ తవ్వకాలు, రవాణా సాగుతున్నాయి. ఆ ప్రాంతంలో కొంత ప్రభుత్వ భూమిలో కూడా అక్రమ తవ్వకాలు సాగిస్తున్నారు. దీంతో అక్కడ భారీగా గోతులు ఏర్పడి, అందులో నీరుచేరి చెరువులను తలపిస్తున్నాయి. కావూరివారిపాలెం, గవినివారిపాలెం, బాపట్ల మండల సరిహద్దుల్లో ఇసుక అక్రమ తవ్వకాలు భారీ స్థాయిలో జరుగుతున్నాయి. అలానే వేటపాలెం మండలం పందిళ్లపల్లి, చినగం జాం మండలం కడవకుదురు సరిహద్దుల్లో ఇసుక అక్ర మ తవ్వకాలు (ఎక్సకవేటర్లతో) సాగుతున్నా యి. అందులో చీరాల నియోజకవర్గంలో కొంత భాగం, పర్చూరు నియోజకవర్గంలో కొంత భాగం ఉంటుంది. 216 జాతీయ రహదారిలో ఎర్రగేటుకు సమీపంలో జరుగుతున్న అక్రమ తవ్వకాలు, రవాణా కూడా బహిరంగ రహస్యమే.



ఇసుక తవ్వకాలతో చెరువులను తలపిస్తున్న గోతులు

క్వారీల్లోకి వెళ్లే అనుమతి మాకు లేదు

- కర్ణ, ఎస్‌ఈబీ సీఐ, చీరాల

ఇసుక అక్రమ రవాణాను అరికట్టటమే మా బాధ్యత. ఇసుక తవ్వకాలు జరిగే క్వారీలలో వెళ్లేందుకు మాకు అనుమతి లేదు. ఆ బాధ్యత మాది కాదు. మా పరిధిలో మేం ఇసుక అక్రమ రవాణాను అరికట్టేందుకు పూర్తి స్థాయిలో ప్రయత్నిస్తున్నాం. గత నెలలో కూడా 10 కేసులు రాశాం.

నిరంతర నిఘా పెడుతున్నాం పూర్తి స్థాయిలో నియంత్రిస్తాం..

ఇసుక అక్రమ తవ్వకాలు, రవాణా నేరం. వాటి నియంత్రణకు నిరంతర నిఘా పెడుతున్నాం. పూర్తి స్థాయిలో అరికట్టేందుకు చర్యలు చేపడుతున్నాం. ఈ రోజు కూడా మా టీంలు ఫీల్డ్‌లోనే ఉన్నాయి. అందుకు ప్రజల సహకారం కూడా అవసరం. సమాచారం తెలిపిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతాం.

- రాజేష్‌కుమార్, మైనింగ్ ఏడీ, బాపట్ల

పంచాయతీల్లో.. జెండా పండుగ



- స్వాతంత్ర్య వేడుకలకు భారీగా నిధులు
- ఖర్చు పరిమితిని రూ.10 నుంచి 10 వేలకు పెంపు
- మేజర్ పంచాయతీలకు రూ. 25 వేల వరకూ అవకాశం

గుంటూరు, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): వంద రూపాయలతో పండగ చేసుకోగలమా? పోనీ 250 రూపాయలతో? సాధ్యమే కాదు కదా? కానీ దేశ వ్యాప్తంగా జరుపుకునే పండుగ, జాతి మొత్తం చేసుకునే జెండా పండుగ, జాతి విముక్తి కోసం త్యాగాలు చేసిన అమరులను స్మరించుకునే పండుగ, ప్రతి ఒక్కరికీ స్వాతంత్ర్యం ఇచ్చిన పండుగ, జరుపుకోవడానికి ఇప్పటి వరకూ పంచాయతీలకు ఇచ్చిన నిధులు అవే. మైనర్ పంచాయతీలు అయితే వంద రూపాయలతో, మేజర్ పంచాయతీలు అయితే 250 రూపాయలతోనే జెండా పండుగ చేసుకోవాలి. స్వాతంత్ర్య వేడుకలు జరుపుకోవాలి. దీంతో జెండా ఎగరేసి మిఠాయిలు పంచడానికి కూడా డబ్బులు ఉండవు. ఈ పరిస్థితిని మార్చేందుకు కూటమి ప్రభుత్వం పూనుకొంది. ప్రత్యేకించి రాష్ట్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి పవన్ కల్యాణ్ ఈ పరిస్థితిపై దృష్టి సారించారు. స్వాతంత్ర్య వేడుకల నుంచే సుపరిపాలను శ్రీకారం చుట్టారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల నిర్వహణకు గ్రామ పంచాయతీలకు భారీ స్థాయిలో నిధులు వినియోగించు కునేందుకు అవకాశం కల్పించారు. దీంతో జిల్లా వ్యాప్తంగా గ్రామ పంచాయతీల్లో స్వాతంత్ర వేడుకలు భారీ స్థాయిలో జరగనున్నాయి.

రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయం సర్పంచుల గౌరవ సంకేతం

గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యానికి భూమిక గ్రామ పంచాయతీ వ్యవస్థ. ఎలాం టి రాజకీయాలతో సంబంధం లేకుండా, పార్టీల పేర్లతో పనిలేకుండా జరిగే ఎన్నికలతో ప్రజలు ఎన్నుకునే పాలకు లతోసాగే ప్రజాస్వామిక పునాది గ్రామ పంచాయతీ. అందుకే గ్రా మాలను దేశాలకు వెన్నెముక అంటారు. దేశంలో ఎవరికీ లేని చెక్ పవర్ పంచా యతీ సర్పంచుకు మాత్రమే వుం టుంది. అలాంటి గ్రామ పంచాయతీ వ్యవస్థ ప్రభ పాలకుల నిర్లక్ష్యం కారణంగా మసకబా రుతూ వస్తోంది. వైసీపీ ఐదేళ్ల పాలనలో పరిస్థితి మరింత దిగజారిపోయింది. గ్రామ సర్పంచులను పూర్తి గా ఉత్సవ విగ్రహాలుగా చేసేశారు. ఆర్థిక సంఘం నిధులతో సహా అన్ని నిధులను దారి మళ్లించి పంచా యతీలను దారుణంగా దెబ్బతీశారు. అలాంటి పరిస్థితి లో ఎన్డీఏ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో గ్రామ పంచాయతీలకు పూర్వ వైభవం రానుంది. ఇప్పటి వరకూ ఉత్సవ విగ్రహాలుగా మారిన పంచాయతీ సర్పంచులకు తిరిగి గౌరవాన్ని కల్పించనుంది.

నేటికీ తొలినాటి నిర్ణయమే అమలు

రాష్ట్రంలో 1994 నుంచి మూడంచెల పంచాయతీరాజ్ వ్యవస్థ అమలులోకి వచ్చింది. ఆనాటి నుంచి గ్రామ పంచాయతీల్లో స్వాతంత్ర్య వేడుకలు జరుపుతున్నారు. ఆ వేడుకలు నిర్వహించకోవడానికి అప్పట్లో రూపొందించిన విధివిధానాలే ఇప్పటి వరకూ అమలులో వున్నాయి.

ఉమ్మడి జిల్లాలో 1042 పంచాయతీల్లో సంబరాలు

2011 జనాభా లెక్కల ప్రకారం ఉమ్మడి గుంటూరు జిల్లాలో 1042 గ్రామ పంచాయతీలు వున్నాయి. వాటిలో 231 మేజర్ పంచాయతీలు, 811 మైనర్ పంచాయతీలు వున్నాయి. కూటమి ప్రభుత్వం తాజాగా తీసుకున్న నిర్ణయం ప్రకారం 811 మైనర్ పంచాయతీలు రూ. 10 వేలు, 231 మేజర్ పంచాయతీలు రూ. 25వేలు చొప్పున నిధులు వినియోగించుకోవచ్చును. ఆ మేరకు ఘనంగా వేడుకలు నిర్వహించడానికి గ్రామ సర్పంచులు, కార్యదర్శులు ఏర్పాట్లలో నిమగ్నమైవున్నారు. మునుపెన్నడూ లేని విధంగా స్వాతంత్ర వేడుకలకు గ్రామ పంచాయతీలు వేదిక కాబోతున్నాయి.

గ్రామ జనాభా 5000 లోపు ఉన్న చిన్న (మైనర్) పంచాయతీలు అయితే స్వాతంత్ర వేడుకలకు రూ. 100 రూపాయలు, గ్రామ జనాభా 5వేలకు మించిన పెద్ద (మేజర్) పంచాయతీలు అయితే 250 రూపాయలు వినియోగించుకోవచ్చు. ఈ నిర్ణయం తీసుకుని దాదాపు 30 ఏళ్లు కావస్తున్నా అదే పరిస్థితి కొనసాగుతోంది. మూడు దశాబ్దాల్లో పెరిగిన జీవన ప్రమాణాలు, వ్యయం, ద్రవ్యోల్బణంతో పోల్చి చూస్తే అది ఎంత తక్కువో ఊహించుకోవచ్చు. ప్రస్తుతమున్న ధరల్లో కనీసం జెండాను తయారు చేయడానికి కూడా ఆ మొత్తం సరిపోదు. దీంతో గ్రామ సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులపై భారం పడేది. వేడుకలను ఘనంగా నిర్వహించడానికి సొంత డబ్బు ఖర్చు చేసుకోవడమో, దాతల విరాళాల మీదో ఆధారపడాల్సి రావడమో జరిగేది. దీంతో పంచాయతీల్లో రాజకీయ జోక్యం, ప్రైవేటు వ్యక్తుల పెత్తనం పెరుగుతూ వచ్చింది. తద్వారా పంచాయతీ వ్యవస్థ నీరుగారిపోయింది.

వెల్లి విరుస్తున్న గ్రామ స్వరాజ్యం

రాజ్యాంగంలో ప్రత్యేక అధ్యాయంగా వున్న గ్రామ స్వరాజ్య సాధనపై కూటమి ప్రభుత్వం, రాష్ట్ర గ్రామీణాభివృద్ధి శాఖా మంత్రి పవన్‌కల్యాణ్ దృష్టి సారించారు. పంచాయతీలకు పూర్వ వైభవం తీసుకురావడానికి జెండా పండుగను వేదికగా చేయాలని భావించారు. అనుకున్నదే తడవుగా జెండా వేడుకలను ఘనంగా నిర్వహించడానికి భారీగా నిధులు కేటాయించారు. దీంతో ఒక్కసారిగా వంద రెట్లు పరిమితిని పెంచారు. చిన్న పంచాయతీలకు ఇప్పటి వరకూ వున్న 100 రూపాయల పరిమితిని రూ. 10వేలకు పెంచారు. పెద్ద(మేజర్) పంచాయతీలకు పరిమితిని 25 రూపాయల నుంచి రూ. 25 వేలకు పెంచారు. దీంతో గ్రామ పంచాయతీలు స్వాతంత్ర వేడుకలను ఘనంగా నిర్వహించుకునే అవకాశం ఏర్పడింది. దీంతో గ్రామ పంచాయతీల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. వైసీపీ హయాంలో కోల్పోయిన తమ ప్రభ, గౌరవం తిరిగి వస్తున్నాయన్న ఆనందం సర్పంచుల్లో కనిపిస్తోంది.

అమరవీరుల త్యాగం భారతావనికే గర్వకారణం

- వారి త్యాగఫలమే నేటి మన తరాలకు ఊపిరి
- తెనాలిలో అమరవీరుల 83వ సంస్మరణ కార్యక్రమం



జాతీయ పతాకాన్ని ఎగురవేసి శాల్యూట్ చేస్తున్న మనోహర్

తెనాలి, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్యోద్యమ కాలంలో బ్రిటిష్ నిరంకుశ పాలనకు ఎదురొడ్డి పోరాడి అశువులుబాసిన ఎందరో అమరవీరుల త్యాగాలు మన భారతావనికే గర్వకారణమని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. క్విట్ ఇండియా ఉద్యమంలో గాంధీజీ పిలుపు మేరకు ఉద్యమబాటపట్టి, తెనాలిలో బ్రిటిష్ పాలకుల తుపాకులకు బలైన ఏడుగురు అమరవీరులకు సోమవారం ప్రభుత్వం తరపున ఘనంగా నివాళులర్పించారు. సోమవారం గాంధీ చౌక్ నుంచి రణరంగ చౌక్ వరకు భారీ ర్యాలీతో, ఎన్సీసీ క్యాడెట్‌ల కవాతు మధ్య మంత్రి మనోహర్ చేరుకున్నారు. భరతమాత విగ్రహానికి పూలమాలలువేశారు. జాతీయ పతాకాన్ని ఎగురవేసి, అమరవీరుల స్థూపాల దగ్గర పుష్పగుచ్ఛాలుంచి నివాళులర్పించారు. దేశం కోసం వారు చేసిన నిస్వార్థ త్యాగం మనకు ఆదర్శం కావాలన్నారు. స్వాతంత్ర్యం కోసం అమరులైన వీరులను భావితరాలు గుర్తుంచుకునే విధంగా దేశంలో ఎక్కడా జరగని విధంగా తెనాలిలో ఏటా సంస్మరణ కార్యక్రమం ప్రభుత్వం తరపున నిర్వహించుకోవటం గొప్ప విషయమన్నారు. కార్యక్రమంలో జేసీ భార్గవ్‌తేజ, సబ్‌కలెక్టర్ ప్రఖర్ జైన్, డీఎస్పీ రమేష్, మున్సిపల్ ఛైర్‌పర్సన్ రాధిక, కమిషనర్ శేషన్న, ఎన్‌సీసీ అధికారులు, విశ్రాంత సైనికోద్యోగులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కార దర్బార్

- ప్రజాదర్బార్‌లో ప్రజలకు లోకేశ్ భరోసా



దివ్యాంగుల సమస్యలు వింటున్న మంత్రి లోకేశ్

తాడేపల్లి టౌన్, ఆగస్టు 12: సమస్యల పరిష్కార దర్బార్‌గా ప్రజాదర్బార్ తమకు అండగా నిలుస్తున్నదని, ఏ సమస్య అయినా నేనున్నానంటూ మంత్రి నారా లోకేశ్ భరోసా ఇస్తున్నారని ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఉండవల్లిలోని నివాసంలో 24వ రోజు సోమవారం ప్రజాదర్బార్‌కు మంగళగిరితోపాటు రాష్ట్రవ్యాప్తంగా ప్రజలు పెద్దఎత్తున తరలివచ్చారు. తమ సమస్యలను మంత్రి దృష్టికి తెచ్చారు. ప్రజల నుండి వచ్చిన పలు విజ్ఞప్తుల తక్షణ పరిష్కారానికి సిబ్బందికి మంత్రి ఆదేశాలు జారీ చేశారు. అందరి సమస్యలు సంయమనంతో విని, వారి నుండి అర్జీలు స్వీకరించారు. ఆటో కార్మికుల సంక్షేమం కోసం మంగళగిరిలో ఎంఎస్ఎంఈ ఆటో పార్క్ ఏర్పాటుచేయాలని మోటార్ టెక్నీషియన్ వర్కర్స్ యూనియన్ ప్రతినిధులు మంత్రి లోకేశ్‌ను కోరారు. అలాగే మంచానికే పరిమితమైన తనకు పెన్షన్ మంజూరుచేసి ఆదుకోవాలని మంగళగిరికి చెందిన పిల్లి శివమ్మ విజ్ఞప్తి చేశారు. ముగ్గురు పిల్లలతో 26 ఏళ్లగా అద్దె ఇంటిలో జీవనం సాగిస్తున్నానని, ఇల్లు మంజూరుచేసి ఆదుకోవాలని మంగళగిరి నియోజకవర్గం ఆత్మకూరుకు చెందిన చింతలచెర్వు మరియమ్మ కోరారు. విద్యుత్ బిల్లు అధికంగా వచ్చిందనే నెపంతో గత ప్రభుత్వం తొలగించిన దివ్యాంగ పెన్షన్ పునరుద్ధరించాలని తాడేపల్లికి చెందిన ఎన్ చెన్నకేశవరావు విజ్ఞప్తి చేశారు. హత్యకు గురైన తన సోదరుడి డెత్ సర్టిఫికెట్ మంజూరుకు ఆదేశాలు ఇవ్వాలని తాడేపల్లికి చెందిన జీ ప్రసాదరావు కోరారు. ఎంసీఏ చదివిన తనకు ఉద్యోగం కల్పించాలని మంగళగిరి నియోజకవర్గం పెదవడ్లపూడికి చెందిన జే మానస విజ్ఞప్తి చేశారు. ఆయా విన్నపాలను పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని మంత్రి భరోసా ఇచ్చారు.

మా భూములను వైసీపీ నేతలు కబ్జా చేశారు...

గత వైసీపీ ప్రభుత్వ హయాంలో విశాఖ జిల్లాలో జరిగిన భూ అక్రమాలపై విచారణ చేసి సామాన్యులమైన మాకు న్యాయం చేయాలని విశాఖ జిల్లా, ఆనందపురం మండలం గొట్టిపల్లికి చెందిన కె.అప్పారావు, కె.శ్రీను, కె.అప్పలరాజు, లోకేశ్‌ను కలిసి విజ్ఞప్తి చేశారు. వంశపారంపర్యంగా వారికి సంక్రమించిన భూములను గత ప్రభుత్వ అండతో వైసీపీ నేతలు కబ్జాచేశారని, అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదన్నారు. విదేశీ విద్య పథకం కింద కెనడాలో చదువుతున్న తమ కుమారుడికి ఆర్థికసాయం మంజూరుచేయాలని ఏలూరు జిల్లా బాపిరాజుగూడెంకు చెందిన బి.శ్రీనివాసరావు, లోకేశ్‌ను కోరారు. అన్ని అర్హతలున్నా తనకు గత ప్రభుత్వం హోంగార్డు ఉద్యోగం కల్పించలేదని ఆశ చూపి వంచించిందని తగిన న్యాయం చేయాలని కాకినాడ జిల్లా సూరంపాలెంకు చెందిన నల్లల మణికంఠ విజ్ఞప్తి చేశారు. తగిన చర్యలు తీసుకుంటామని వీరికి మంత్రి హామీ ఇచ్చారు. కరోనా సమయంలో వైద్యసేవలందించిన తమను 2021 సెప్టెంబరులో ఉద్యోగాల నుండి తొలగించారని తగిన న్యాయం చేయాలని కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేసిన సిబ్బంది మంత్రికి విజ్ఞప్తి చేశారు. గత ప్రభుత్వ హయాంలో ఇంటిస్థలాన్ని కబ్జా చేసి, భయభ్రాంతులకు గురిచేస్తున్న వైసీపీ నేత నాదెండ్ల చంద్రమౌళిపై విచారణ జరిపించి తగిన చర్యలు తీసుకోవాలని ప్రకాశం జిల్లా మార్కాపురానికి చెందిన పెరుమాళ్ల మోహనరావు విజ్ఞప్తి చేశారు. నాదెండ్ల చంద్రమౌళి, అతడి తండ్రి నాదెండ్ల సుబ్రహ్మణ్యం రాష్ట్రవ్యాప్తంగా వందలాది ఎకరాల అసైన్డ్ భూములు కూడా కాజేశారని ఫిర్యాదు చేశారు. భూ అక్రమాలపై విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

పల్నాడు రైతుల అవసరాలకు తగ్గట్టు ఎరువులు కేటాయించండి

- 2500 మెట్రిక్ టన్నుల యూరియా, డీఏపీ సరఫరా చేయాలి
- రసాయనాలు, ఎరువుల మంత్రిత్వ శాఖ ప్రత్యేక కార్యదర్శిని కోరిన ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు

నరసరావుపేట రూరల్, ఆగస్టు 12: వ్యవసాయధారిత పల్నాడు ప్రాంతంలో రైతుల అవసరాలకు తగ్గట్టుగా, సాగుకు ఇబ్బంది లేకుండా ఎరువులు కేటాయించాలని.. కేంద్ర రసాయనాలు, ఎరువుల మంత్రిత్వశాఖ ప్రత్యేక కార్యదర్శి నీరజా అడిడంను టీడీపీ పార్లమెంటరీ పార్టీ నేత, నరసరావుపేట పార్లమెంట్ సభ్యుడు లావు శ్రీకృష్ణదేవరాయలు అభ్యర్థించారు. ఈ మేరకు కేంద్ర కార్యదర్శికి ఎంపీ వినతిని పంపించారు. నాగార్జునసాగర్ నుండి సాగునీటిని విడుదల చేయడం వల్ల ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో పంటలు అధికంగా వేసేందుకు రైతులు సిద్ధంగా ఉన్నారని, మరో 15 రోజుల తర్వాత వరి, మిర్చి వంటి పంటల సాగుకు సన్నద్ధం అవుతున్నారని తెలిపారు. ఈ పంటల సాగుకు డీఏపీ ఎరువులు 2500 మెట్రిక్ టన్నుల మేర అవసరం ఉందని, కావున పల్నాడు జిల్లాకు ఎరువుల శాఖ నుండి ఒక రేక్ డీఏపీ కేటాయించేలా చొరవ చూపాలని కోరారు.

పల్నాడు జిల్లాను సందర్శించిన కేంద్ర నోడల్ బృందం



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ అరుణ్‌బాబు

నరసరావుపేట రూరల్, ఆగస్టు 12: జల శక్తి అభియాన్ పథకం కింద పల్నాడు జిల్లాలో అమలవుతున్న వివిధ కార్యక్రమాలను పరిశీలించేందుకు కేంద్ర నోడల్ అధికారి, సంయుక్త కార్యదర్శి కేంద్ర ఆర్థిక మంత్రిత్వశాఖ సాల్మాన్ ఆరోక్యరాజ్, సెంట్రల్ భూగర్భ జలశాఖ అధికారి టి.మాధవ్ సోమవారం పల్నాడు జిల్లాను సందర్శించారు. మూడు రోజుల పర్యటనలో భాగంగా మొదటి రోజు పల్నాడు జిల్లాలోని నాదెండ్ల మండలంలో క్షేత్ర పరిశీలనలో భాగంగా చిరుమామిళ్ల గ్రామంలో జలజీవన్ మిషన్ అమలుతీరును పరిశీలించారు. మంచినీటి చెరువును, హెడ్‌వర్క్స్‌ను పరిశీలించారు. అనంతరం చంఘిజ్‌ఖాన్‌పేట గ్రామంలో ఉపాధి హామీ పథకం కింద చేపడుతున్న నీటి సంరక్షణ పనుల నిర్మాణాలను పరిశీలించారు. కొండవీడు, కొత్తపాలెం గ్రామాలలో ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టిన సేద్యపు నీటికుంట పనులను పరిశీలించారు. రైతులు సాగుచేస్తున్న గులాబీ, నిమ్మ, తైవాన్ జామతోటలను పరిశీలించి రైతులు పొందుతున్న లబ్ధిని తెలుసుకున్నారు. అనంతరం కలెక్టరేట్‌లో కలెక్టర్‌తో కలిసి నోడల్ అధికారి వివిధ శాఖల అధికారులతో సమావేశమై జలశక్తి అభియాన్ కింద చేపడుతున్న నీటి సంరక్షణ చర్యలను అడిగి తెలుసుకున్నారు, జలశక్తి కేంద్రం పనితీరును సమీక్షించారు. డ్వామా అధికారులు ఏర్పాటుచేసిన జలశక్తి అభియాన్ ఫోటో ఎగ్జిబిషన్, స్టాల్స్‌ను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ సూరజ్ గనోరే తదితరులు పాల్గొన్నారు.

జవహర్ నవోదయలో రీజనల్ హ్యాండ్‌బాల్ పోటీల ప్రారంభం

- వివిధ రాష్ట్రాల నుంచి పాల్గొన్న 500మంది విద్యార్థులు



క్రీడా జ్యోతిని వెలిగిస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు

చిలకలూరిపేట, ఆగస్టు 12: చిలకలూరిపేట మండలం మద్దిరాలలోని జవహర్ నవోదయ విద్యాలయంలో సోమవారం రీజనల్ హ్యాండ్‌బాల్ మీట్ 2024 (హ్యాండ్ పోటీలు) ప్రారంభమయ్యాయి. మూడురోజుల పాటు జరిగే పోటీలను పల్నాడు జిల్లా కలెక్టర్ పీ అరుణ్‌బాబు ప్రారంభించారు. నవోదయ విద్యాలయ సమితి జెండాను ఆవిష్కరించి, క్రీడా జ్యోతిని ప్రజ్వలన చేశారు. విద్యార్థుల గౌరవ వందనాన్ని ఆయన స్వీకరించారు. వివిధ రాష్ట్రాల నుంచి వచ్చి పోటీల్లో పాల్గొంటున్న విద్యార్థులకు ఆతిథ్యంలో లోటు లేకుండా చూడాలని కోరారు. పోటీల్లో ఏపీ, తెలంగాణా, కర్నాటక, కేరళ, అండమాన్ నికోబార్, లక్ష ద్వీప్‌లలో ఉన్న జవహర్ నవోదయ విద్యార్థులు పాల్గొంటున్నారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6వరకు పోటీలు నిర్వహిస్తున్నారు. మరో గౌరవ అతిథి ధనలక్ష్మి గ్రూపు సంస్థల డైరెక్టర్ పేర్ని వీరనారాయణ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం మద్దిరాల జవహర్ నవోదయ విద్యాలయంలో ప్రాంతీయ స్థాయి, క్లస్టర్ స్థాయి పోటీలు నిర్వహించటం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ అరుణ్‌బాబును ప్రిన్సిపాల్ నల్లూరి నరసింహారావు సత్కరించారు.

విషజ్వరాలతో మంచం పట్టిన వడ్లమూడి

- ఇప్పటికే ఇద్దరు మృతి
- చికిత్స పొందుతున్న ఆరుగురు



వడ్లమూడిలో ఏర్పాటుచేసిన వైద్య శిబిరం

పొన్నూరుటౌన్ (చేబ్రోలు), ఆగస్టు 12: చేబ్రోలు మండలంలోని వడ్లమూడి గ్రామం విషజ్వరాలతో మంచం పట్టింది. గత కొద్దిరోజులుగా వైరల్ ఫీవర్స్, డెంగీ గ్రామంలో విజృంభిస్తున్నాయి. విష జ్వరాలపాలై ఆరుగురు ఇటీవల ఆసుపత్రిలో చేరి చికిత్స పొందుతున్నట్లు సమాచారం. రెండు రోజుల క్రితం విష జ్వరాలతో బాధపడుతున్న తాతారావు (65), కృష్ణకుమారి (52) అనే వ్యక్తులు మృతిచెందినట్లు గ్రామస్తులు తెలిపారు. వడ్లమూడి గ్రామంలో గత కొంత కాలంగా అధ్వాన పారిశుధ్య పరిస్థితులు నెలకొన్నాయి. వడ్లమూడి గ్రామం తెనాలి, గుంటూరు ప్రధాన రహదారి చెంతనే ఉన్నప్పటికి గ్రామంలో పారిశుధ్యం గురించి పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. గ్రామంలో ఎటుచూసినా చెత్తచెదారాలు, కుళ్లిన వ్యర్థాలు దర్శనం ఇస్తున్నాయి. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు నీరు లోతట్టు ప్రాంతాల్లో, జనావాసాల మధ్య ఖాళీస్థలాల్లో రోజుల తరబడి నిల్వ ఉండి వ్యాధికారక దోమలు ఈ మురుగునీటిలో వృద్ధి చెంది విషజ్వరాలు ప్రబలుతున్నాయని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. గత కొద్దిరోజులుగా గ్రామంలో విషజ్వరాలు ప్రబలుతున్నప్పటికీ పంచాయతీ సిబ్బంది కానీ, వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది కానీ ఆ గ్రామం వైపు కన్నెత్తి చూడలేదు. అయితే విషజ్వరాలతో ఇరువురు మృతి చెందారని సమాచారం బయటకు పొక్కటంతో సోమవారం వైద్య ఆరోగ్య శాఖ అధికారులు అప్పటికప్పుడు గ్రామంలో వైద్యశిబిరాన్ని ఏర్పాటుచేశారు. గ్రామంలో ఇంటింటి సర్వే నిర్వహించి జ్వర పీడితులను గుర్తించే పనిలో పడ్డారు. ఈ సమాచారం తెలుసుకున్న జిల్లా వైద్యశాఖ డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో ఈ అన్నపూర్ణ వడ్లమూడి గ్రామాన్ని సందర్శించి పరిస్థితిని సమీక్షించారు. అంతేకాకుండా పంచాయతీ అధికారులతో సంప్రదించి తక్షణమే జనావాసాల మధ్య ఉన్న మురుగునీటిని తరలించాలని ఆదేశించారు. దోమల వ్యాప్తి నిరోధానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. వరుసగా జ్వర పీడితుల సంఖ్య పెరగటంతో గ్రామస్తుల్లో భయాందోళనలు వ్యక్తం అవుతున్నాయి.

ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకింగ్స్‌లో మెరిసిన ఏఎన్‌యూ

- 97వ ర్యాంకు కైవశం చేసుకున్న వర్సిటీ

పెదకాకాని, ఆగస్టు 12: జాతీయస్థాయి యూనివర్సిటీ ర్యాంకింగ్‌లో ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం మెరిసింది. గతంతో పోల్చుకుంటే తన సత్తాను మెరుగుపరచుకొని జాతీయ ర్యాంకుల్లో టాప్ 100లో నిలవడం గమనార్హం. దేశంలో ప్రతిష్ఠాత్మకంగా భావించే నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ర్యాంకింగ్ ఫ్రేమ్ వర్క్ (ఎన్ఐఆర్ఎఫ్-2024) ర్యాంకులు సోమవారం విడుదలయ్యాయి. ఇందులో ఓవరాల్ యూనివర్సిటీ కేటగిరీలో ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం 97వ స్థానాన్ని కైవశం చేసుకుంది. అలాగే యూనివర్సిటీల కేటగిరీలో 59వ ర్యాంకు, స్టేట్ యూనివర్సిటీ కేటగిరీలో 20 ర్యాంకు, యూనివర్సిటీ ఫార్మసీ కళాశాలల విభాగంలో 63వ ర్యాంకును పదిలపరుచుకుంది. ఈ సందర్భంగా విశ్వవిద్యాలయ ఇన్‌ఛార్జి వీసీ ప్రొఫెసర్ కంచర్ల గంగాధరరావు, ఇన్‌ఛార్జి రెక్టార్ ప్రొఫెసర్ కె. రత్నషీలామణి, ఇన్‌ఛార్జి రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జి.సింహాచలం హర్షం వ్యక్తం చేశారని ర్యాంకింగ్ కోఆర్డినేటర్ డాక్టర్ పి. రవి తెలిపారు.

గంజాయి విక్రేతల అరెస్టు.. కేజిన్నర స్వాధీనం

పొన్నూరుటౌన్, ఆగస్టు 12: వ్యసనాలకు బానిసలు అవటమే కాకుండా గంజాయికి అలవాటు పడి అదే గంజాయిని విక్రయించి సొమ్ము చేసుకోవాలనుకున్న నలుగురు వ్యక్తులను అర్బన్ సీఐ భాస్కర్ అరెస్టు చేశారు. పొన్నూరుకు చెందిన దేవరకొండ రాజ్‌కుమార్, గుంటూరుకు చెందిన ఇర్ల చైతన్య స్నేహితులు. షేక్ జబిరుల్లా దగ్గర గంజాయి ఉందని తెలుసుకున్న ఉప్ప కార్తీక్ అనే వ్యక్తి తన స్నేహితులైన రాజ్‌కుమార్, చైతన్యలకు, ప్రతిపాడుకు చెందిన షేక్ ఇసాక్‌కు గంజాయి విక్రయించి సొమ్ము చేసుకోవటమే కాకుండా గంజాయిని తాగుదామని సమాచారం ఇచ్చాడు. జబిరుల్లా వద్ద గంజాయిని తీసుకునేందుకు ఈ నెల 11వ తేదీన పొన్నూరు పట్టణంలోని ఇంటూరు రోడ్డు వద్ద సమావేశమయ్యారు. ఉప్పకార్తీక్, ఇర్ల చైతన్య, దేవరకొండ రాజ్‌కుమార్, షేక్ ఇసాక్‌లు గంజాయిని వాటాలు వేసుకుని తీసుకువెళుతుండగా అర్బన్ సీఐ భాస్కర్ దాడి చేసి ఆ నలుగురు నిందితులను అరెస్టు చేశారు. షేక్ జబిరుల్లా పరారీలో ఉన్నాడు. నలుగురు నిందితులను అరెస్టు చేసి వారి నుంచి కేజిన్నర గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు సీఐ భాస్కర్ తెలిపారు.

నాగార్జునసాగర్ క్రస్ట్‌గేట్లు మూసివేత

మాచర్ల రూరల్, ఆగస్టు 11: నాగార్జునసాగర్ ప్రాజెక్ట్ క్రస్ట్‌గేట్లను సోమవారం అధికారులు మూసివేశారు. ప్రాజెక్ట్‌కు ఇన్‌ఫ్లో వాటర్ తక్కువగా వస్తుండడంతో పూర్తిస్థాయిలో క్రస్ట్ గేట్ల ద్వారా నీటి విడుదలను నిలిపివేశారు. కాగా నాగార్జున సాగర్ జలాశయం నీటిమట్టం 588.80 అడుగులు ఉంది. ఇది 308.46 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 6253 క్యూసెక్కులు, ఎడమ కాలువ ద్వారా 8541, ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా 29,841, ఎస్ఎల్‌బీసీ ద్వారా 1800, ఎల్ఎల్‌సీ ద్వారా 600, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్‌గా 47,035 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం నుంచి నాగార్జునసాగర్‌కు ఇన్‌ఫ్లో వాటర్‌గా 47,035 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది.

ప్రకాశం బ్యారేజి వద్ద కొనసాగుతున్న వరద ఉధృతి

- దిగువకు 51 వేల క్యూసెక్కులు విడుదల
- డెల్టా కాలువలకు 14వేల క్యూసెక్కులు..

తాడేపల్లి టౌన్, ఆగస్టు 12: ఎగువ ప్రాజెక్టుల నుండి భారీగా వరదనీరు వస్తుండటంతో ప్రకాశం బ్యారేజి వద్ద వరద ఉధృతి కొనసాగుతోంది. ఎగువన ఉన్న పులిచింతల ప్రాజెక్టు నుండి 58వేలు, కీసరవాగు నుండి 7వేల క్యూసెక్కుల వంతున మొత్తం 65వేల క్యూసెక్కుల వరద నీరు సోమవారం ప్రకాశం బ్యారేజి వద్దకు చేరుతున్నట్టు నీటిపారుదల శాఖ జేఈ దినేష్ తెలిపారు. బ్యారేజి రిజర్వాయర్‌లో 12 అడుగుల నీటిమట్టం కొనసాగుతుండగా 70 గేట్లను 1 అడుగు వంతున ఎత్తి దిగువకు 51,100 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. అలాగే తూర్పు, పశ్చిమ డెల్టా కాలువలకు 14వేల క్యూసెక్కుల నీటిని వదులుతున్నట్టు జేఈ తెలిపారు.

టీడీపీ నేతపై రాళ్లతో దాడి

- అధికారం కోల్పోయినా మారని వైసీపీ నేతల తీరు



గాయపడిన షేక్ జానయ్య

దాచేపల్లి, ఆగస్టు 12: టీడీపీ మైనారిటీ నాయకుడు షేక్ జానయ్యపై వైసీపీ నాయకులు రాళ్లతో దాడిచేసి గాయపరిచిన సంఘటన ఆదివారం రాత్రి 10 గంటల సమయంలో జరిగింది. పోలీసులు, బాధితులు తెలిపిన వివరాలిలా వున్నాయి. పల్నాడు జిల్లా దాచేపల్లి మండలం కేశానుపల్లి గ్రామానికి చెందిన మైనారిటీ నాయకుడు షేక్ జానయ్య గ్రామంలో 2 కోట్ల రూపాయలతో విద్యుత్‌శాఖ ఆధ్వర్యంలో జరుగుతున్న అభివృద్ధి పనులపై స్థానికులతో మాట్లాడుతున్నారు. అదే సమయంలో గ్రామానికి చెందిన నెల్లూరి రామారావు వచ్చి గ్రామంలో నీ పెత్తనం ఏమిటంటూ జానయ్యను దుర్భాష లాడుతూ పక్కనే వున్న బండరాయితో తలపై మోదాడు. ఈ దాడిలో జానయ్య తలకు తీవ్రగాయమై రక్తస్రావం జరిగింది. స్థానికులు కేకలు వేయడంతో దాడికి పాల్పడిన రామారావు అక్కడినుండి వెళ్లిపోయాడు. సమాచారం అందుకున్న కుటుంబసభ్యులు, స్థానికులు గాయపడిన జానయ్యను గురజాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించి ప్రథమ చికిత్స నిర్వహించి మెరుగైన వైద్యం కోసం నరసరావుపేటకు తీసుకెళ్లారు. ఆపై గుంటూరు తరలించి వైద్యసేవలు అందించారు. వైసీపీ నేతలు గ్రామంలో జరుగుతున్న అభివృద్ధి పనులను సహించలేక మైనారిటీ నాయకుడు జానయ్యపై దాడిచేయడంపై టీడీపీ నేతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. జరిగిన సంఘటనను తెలుసుకున్న ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు జానయ్యను పరామర్శించారు. బాధితుడు జానయ్య మాట్లాడుతూ పాతకక్షలు మనసులో పెట్టుకొని జరుగుతున్న అభివృద్ధి పనులను చూసి సహించలేక ఈ దాడికి పాల్పడినట్లు పేర్కొన్నాడు. సమాచారం అందుకున్న దాచేపల్లి పోలీసులు గ్రామానికి చేరుకొని అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బందోబస్తు ఏర్పాటు చేశారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.80
- నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	94, 102,113
చికెన్ విత్ స్కిన్	182.00
చికెన్ స్కిన్ లెస్	192.00

బాపట్ల వార్తలు

16 నుంచి రెవెన్యూ గ్రామ సభలు


తహసీల్దార్ నెహ్రూబాబు

అమృతలూరు, ఆగస్టు 12 : మండలపరిధిలోని గ్రామాల్లో ఈ నెల 16వ తేదీ నుంచి రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ నెహ్రూబాబు సోమవారం తెలిపారు. ఈ సదస్సుల్లో రైతులకు సంబంధించిన 1బీ, అండగల్ ఆన్‌లైన్‌లో సక్రమంగా ఉన్నాయా లేదా అని పరిశీలించుకోవచ్చున్నారు. ఏమైనా భూ సమస్యలు ఉంటే అర్జీలు అందజేస్తే వాటిని పరిశీలించి పరిష్కరిస్తామని చెప్పారు. తమ భూమి సర్వే చేయించుకోదలచిన వారు అర్జీ చేసుకోవచ్చునన్నారు. భూ యజమానులు తమకు చెందిన భూమి ఆన్‌లైన్‌లో నమోదు కాకపోతే సంబంధిత పత్రాలు అందజేస్తే వాటిని పరిశీలించి వారికి తగిన న్యాయం చేస్తామన్నారు. బోడపాడు, యలవర్రు గ్రామాల్లో రీ సర్వే పూర్తి స్థాయిలో పూర్తి చేశారని ఆయా గ్రామాల్లో కొంత మంది రైతులు తమ భూమి సక్రమంగా నమోదు కాలేదని చెబుతున్నారని వారికి సంబంధించిన పత్రాలు అందజేస్తే వాటిని పరిశీలిస్తామన్నారు. గ్రామ సభల వివరాలు ఇలా ఉన్నారు. 16వ తేదీ కూచిపూడి, 17న పెదపూడి, 19న మూల్పూరు, 20న అమృతలూరు, 21న పాంచాళవరం, 22న గోవాడ, 23న యలవర్రు, 24న ఇంటూరు, 27న మోపర్రు, 28న తురుమెళ్ల, 29న కోరుతాడి పర్రు 30న ప్యాపర్రు, 31న బోడపాడు, సెప్టెంబరు 2న యడవూరు గ్రామాల్లో సదస్సులు జరుగుతాయని తహసీల్దార్ చెప్పారు. రైతులు ఈ అవకాశం సద్వినియోగించుకోవాలని సూచించారు.

పంచాయతీ కార్యదర్శులకు, సర్పంచులకు శిక్షణ


శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఈవోపీఆర్డీ కె.పద్మజ, సూపరింటెండెంట్ బి.మధుసూదనరెడ్డి

పిట్టలానిపాలెం, ఆగస్టు 12: పిట్టలవానిపాలెం మండల విద్యాపరిషత్ కార్యాలయం సమావేశపు హాల్లో సోమవారం గ్రామపంచాయతీల సర్పంచులకు, కార్యదర్శులకు శిక్షణా కార్యక్రమాన్ని ఎంపీడీవో ఎం.వి.రమణమూర్తి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. గాంధీజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. పంచాయతీ సర్పంచులు, కార్యదర్శులకు పరిచయ కార్యక్రమం, శిక్షణలో రాజీలేని సూత్రాలు, శిక్షణ అంశాలపై వారితో మాట్లాడారు. గ్రామపంచాయతీ నిధులు, బాధ్యతలు ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ చట్టం తదితర అంశాలు, పారిశుధ్యం, ఘనవ్యర్థాల నిర్వహణ, గ్రామపంచాయతీల చట్టం గురించి సమావేశంలో తెలియజేశారు. గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళికలలో భాగంగా దిమాజికల్ అప్రోచ్ నేపథ్యంలో జీపీడీపీ ప్రాసెస్ చేయు విధానం, గ్రామపంచాయతీల ఆదాయాలు, ఖర్చులు సంబంధించిన గైడ్‌లైన్స్‌ను వారికి వివరించారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ కె.పద్మజ, మండలపరిషత్ సూపరింటెండెంట్ బి.మధుసూదనరెడ్డి, శిక్షకులుగా వ్యవహరించిన ఎంఈవోఈ శ్రీనివాసరావు, బి.వీరేంద్ర పాల్గొన్నారు.

కార్యకర్త కుటుంబానికి ఎమ్మెల్యే ఆనందబాబు పరామర్శ


గోపీచంద్ మృతదేహం వద్ద నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే ఆనందబాబు

అమృతలూరు, ఆగస్టు 12: మండలంలోని కూచిపూడి గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త త్రిపురనేని గోపీచంద్ సోమవారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు గోపీచంద్ మృతదేహంను సందర్శించి సంతాపం తెలిపి కుటుంబసభ్యులకు తన సానుభూతి వ్యక్తం చేశారు. ఆయన వెంట యలవర్తి బ్రహ్మానందం, యలమంచిలి జగన్మోహనరావు, మట్లపూడి జయపాల్, మేకా రాంబాబు, యలవర్తి రఘుబాబు, మేకా రామకృష్ణ, కోగంటి రాజేష్, ఎం ఆనంద్, తదితరులున్నారు.

స్కూటీని ఢీ కొట్టిన లారీ.. మహిళ మృతి


జ్యోతి (ఫైల్ ఫొటో)

వేమూరు, ఆగస్టు 12: మండలంలోని పెరవలిపాలెం గ్రామ శివారు మలుపులో లోడు లారీ ఎదురు గా వస్తున్న స్కూటీని ఢీ కొట్టింది. దీంతో స్కూటీపై ప్రయాణిస్తున్న ఇద్దరు మహిళల్లో ఒకరు అక్కడిక్కడే మృతి చెందారు. సోమవారం మధ్యాహ్నం ఈ సంఘటన జరిగింది. పెరవలిపాలెం గ్రామానికి చెందిన కూచిపూడి జ్యోతి కుమార్తె శ్వేత తన తల్లిని చూసేందుకు చేబ్రోలు మండలం వేజండ్ల గ్రామం నుంచి పెరవలిపాలెంకి వచ్చింది. తిరిగి వెళ్లేటప్పుడు తన స్కూటీపై తల్లి కూచిపూడి జ్యోతిని కూడా వేజెండ్లకు తీసుకువెళుతుంది. ఈ సందర్భంలో పెరవలిపాలెం గ్రామ శివారు మలుపులో ఎదురుగా వస్తున్న లోడ్ లారీ స్కూటీని ఢీ కొట్టింది. పడిపోయిన తల్లి జ్యోతి(39) తలకు తీవ్ర గాయం కావడంతో అక్కడిక్కడే మృతి చెందింది. ప్రమాద స్థలానికి చేరుకున్న వేమూరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రామినేని రమేష్ మృతి విద్యారంగానికి తీరనిలోటు

యూటీఎఫ్ నాయకులు కోశాధికారి వెంకటేశ్వరరెడ్డి

కర్లపాలెం, ఆగస్టు 12: యూటీఎఫ్ నాయకులు రామినేని రమేష్ మృతి చెందటం విద్యారంగానికి తీరనిలోటు అని బాపట్ల జిల్లా యూటీఎఫ్ కోశాధికారి వెంకటేశ్వరరెడ్డి అన్నారు. సింగపూర్‌లో తమ పిల్లల వద్ద ఉన్న రమేష్ సోమవారం హఠాన్మరణం చెందటం ఉపాధ్యాయులందరిని తీవ్రంగా కలిసివేసింది. రమేష్ మృతికి యూటీఎఫ్ నాయకులు, పలు ఉపాధ్యాయులు కర్లపాలెం తహసీల్దార్ కార్యాలయం వద్ద యూటీఎఫ్ జెండా దిమ్మె వద్ద మౌనం పాటించారు. వారి కుటుంబసభ్యులకు తమప్రగాఢ సానుభూతిని తెలిపారు. కార్యక్రమంలో ఇనకొల్లు పోలీసురావు, ప్రభాకర్, ఆట్ల శ్రీనివాసరెడ్డి, ఐవీఆర్ తదితరులు ఉన్నారు.

మాదకద్రవ్యాల నిషేధంపై అవగాహన సదస్సు

బాపట్ల, ఆగస్టు 12: మండల న్యాయసేవాధికార సంస్థ బాపట్ల ఆధ్వర్యంలో సోమవారం మాదకద్రవ్యాల నిషేధం, నిర్మూలనపై అవగాహన సదస్సు నిర్వహించారు. బాపట్ల జూనియర్ కాలేజి నందు నిర్వహించిన ఈ సదస్సుకు అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జి ఎం పవన్‌కుమార్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ యువత మాదకద్రవ్యాలకు అలవాటు పడితే భవిష్యత్తు దెబ్బతింటుందన్నారు. క్రమశిక్షణ జీవితాన్ని యువత అలవర్చుకోవాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో చిన్న వయస్సు నుంచి మాదకద్రవ్యాల వాడకానికి అలవాటుపడుతున్నారని దీనివల్ల యువత వారి జీవితంలో ఎన్నో కోల్పోవాల్సి వస్తుందన్నారు. మాదకద్రవ్యాలకు దూరంగా ఉంటే నిర్దేశించుకున్న లక్ష్యాలను అధిగమించి జీవితాన్ని ఉన్నతంగా కొనసాగించే వీలు కలుగుతుందన్నారు. సదస్సులో ప్యానల్ లాయర్ భీమా లీలా కృష్ణ, ప్రిన్సిపాల్ జి.కోటేశ్వరరావు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి చెస్ పోటీలకు లిటిల్ ఏంజెల్స్ విద్యార్థులు



ఎంపికైన లిటిల్ ఏంజెల్స్ విద్యార్థులు

బాపట్ల, ఆగస్టు 12 : అండర్-13 బాలబాలికల చెస్ పోటీల్లో అత్యుత్తమ ప్రతిభను కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు బాపట్ల లిటిల్ ఏంజెల్స్ విద్యార్థులు ఎంపికయ్యారు. జిల్లా స్థాయి చెస్ పోటీల్లో సత్తా చాటిన సీహెచ్ వేదశ్రీనిధి బాలికల విభాంలో ప్రథమస్థానంలో, బి.నిఖిల్ బాలుర విభాగంలో ప్రథమస్థానం, వి.కుశల్ ద్వితీయ స్థానంలో నిలిచారు. వీరు శ్రీకాకుళం నుంచి జరిగే రాష్ట్రస్థాయి చెస్‌పోటీల్లో ప్రాతినిధ్యం వహిస్తారని స్కూల్ యాజమాన్యం తెలిపారు. ఇదే పాఠశాల కు చెందిన విద్యార్థులు అండర్ -11 విభాగంలో కూడా ఇటీవల అత్యుత్తమ ప్రతిభను కనబరిచారు. ఎంపికైన విద్యార్థులను పాఠశాల యాజమాన్యం అభినందించింది.

స్వాతంత్ర్య వేడుకలను ఘనంగా నిర్వహించాలి

వేమూరు, ఆగస్టు 12: రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు 78వ స్వాతంత్ర్య దినోత్సవాలను 15వ తేది గురువారం మండలపరిధి గ్రామాల్లో ఘనంగా నిర్వహించాలని ఎంపీడీవో శేషగిరిరావు పేర్కొన్నారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు ఆర్థికంగా సహకరిస్తుందని అన్నారు. మైనర్ గ్రామ పంచాయితీలకు పది వేల రూపాయలు, మేజర్ గ్రామ పంచాయతీలకు రూ.25వేలు నిధులు కేటాయించారన్నారు. అధికారులు ఉద్యోగులు, తప్పనిసరిగా హాజరు కావాలన్నారు.

బాధితులకు తక్షణమే న్యాయం చేయాలి

● ప్రజాసమస్యల పరిష్కారవేదికలో కలెక్టర్ జేవీ మురళి


ప్రజాసమస్యల పరిష్కారవేదికలో కలెక్టర్ జె.వెంకటమురళికి వినతిపత్రాల ద్వారా సమస్యలు వివరిస్తున్న ప్రజలు

బాపట్ల, ఆగస్టు 12: బాధితులకు తక్షణమే మేలు జరిగేలా అర్జీలను పరిష్కరించాలని కలెక్టర్ జె.వెంకటమురళి అధికారులను ఆదేశించారు. ప్రజాసమస్యల పరిష్కారవేదిక కార్యక్రమం సోమవారం కలెక్టరేట్‌లో జరిగింది. కలెక్టర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి అర్జీదారులు పెద్దసంఖ్యలో హాజరయ్యారు. తమ సమస్యలను పరిష్కరించాలంటూ వినతిపత్రాల ద్వారా కలెక్టర్‌కు విన్నవించారు. తన పరిధిలో వాటికి అక్కడికక్కడే పరిష్కారం చూపించిన కలెక్టర్ మిగిలినవి పరిశీలన, విచారణ చేయాలంటూ సంబంధితాధికారులకు పంపించారు. ఎప్పటికప్పుడు అర్జీకి సంబంధించిన సమస్యను ఆప్రాంత అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడి వివరించి పరిష్కరించాలని ఆదేశించారు.

రెవెన్యూ సదస్సులు విస్తృతంగా నిర్వహించాలి

● 15 నుంచి సెప్టెంబరు 30 వరకు 277 రెవెన్యూ గ్రామాల్లో..

రెవెన్యూ సదస్సులు ఈనెల 15వ తేదీ నుంచి సెప్టెంబరు 30వ తేదీ వరకు జిల్లాలో విస్తృతంగా నిర్వహించాలని కలెక్టర్ జె.వెంకటమురళీ అధికారులకు తెలియజేశారు. ప్రజాసమస్యల పరిష్కారవేదిక కార్యక్రమానికి హాజరైన అధికారులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ ప్రజాసమస్యల పరిష్కారవేదికలో నమోదవుతున్న అర్జీలలో 60శాతం రెవెన్యూశాఖకు సంబంధించిన సమస్యలే ఉండటంతో ప్రభుత్వం ఈ కార్యక్రమం నిర్వ హిస్తుందన్నారు. 277 రెవెన్యూ గ్రామాల్లో 45రోజుల పాటు ఈ సదస్సులు జరుగుతాయన్నారు. రెవెన్యూ సదస్సుల నిర్వాహణపై ముందస్తు ప్రణాళిక రూపొందించుకోవాలని అధికారులను ఆదేశించారు. మండల ప్రత్యేకాధికారులుగా గతంలో నియమితులైన జిల్లా అధికారులే సదస్సుల నిర్వహణ కోసం ఆయా మండలాలకు ప్రత్యేకాధికారులుగా వ్యవహరిస్తారని చెప్పారు. రెవెన్యూ దస్త్రాలు, రెవెన్యూ గ్రామ మ్యాప్‌లు ప్రజలకు అందుబాటులో ఉంచాలని స్పష్టం చేశారు. క్షేత్ర స్థాయిలో ఈ కార్యక్రమాలు అధికారులు నిర్వహించటానికి ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. తహసీల్దార్‌లు, ఎంపీడీవోలు, అటవీ శాఖ, సర్వేల్యాండ్స్‌రికార్డ్స్, దేవదాయశాఖాధికారులతో మండలస్థాయి బృందాలను నియమించాలన్నారు. రెవెన్యూశాఖ నుంచి ఒకరు బాధ్యులుగా వ్యవహరించాలని ఆదేశించారు. గత ప్రభుత్వ హయాంలో ప్రజలకు జారీ చేసిన పట్టాదారు పాస్‌పుస్తకాలను తిరిగి తీసుకోవాలన్నారు. వాటి స్థానాల్లో ప్రభుత్వ చిహ్నంతో ముద్రించిన నూతన పుస్తకాలను వారికి పంపిణీ చేయాలని ఆయన ఆదేశించారు. బాపట్లజిల్లాలో సదస్సుల నిర్వాహణపై పరిశీలకులుగా సీనియర్ ఐఏఎస్ అధికారిని ప్రత్యేకాధికారిగా నియమిస్తారని కలెక్టర్ తెలిపారు. ఈ నేపథ్యంలో వాట్సప్‌లో ప్రత్యేకగ్రూప్ అధికారుల కోసం ఏర్పాటు చేయాల ని సూచించారు. క్షేత్ర స్థాయిలో జరిగే ఈ కార్యక్రమాలను ప్రజలు సద్వినియోగించుకునేలా చైతన్యం తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ బి.సుబ్బారావు, జిల్లా రెవెన్యూ అధికారి సీహెచ్ సత్తిబాబు, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

క్విట్ ఇండియా ఉద్యమంలో బాపట్ల పాత్ర అద్వితీయం

●ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ


స్వాతంత్ర్య సమరయోధుల శిలఫలకం వద్ద నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ, పీసీ సాయిబాబు

బాపట్ల, ఆగస్టు 12 : క్విట్ ఇండియా ఉద్యమంలో బాపట్ల అద్వితీయమైన పాత్రను పోషించిందని ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ పేర్కొన్నారు. 82వ క్విట్ ఇండియా దినోత్సవం సందర్భంగా సోమవారం ఫోరంఫర్‌బెటర్ బాపట్ల ఆధ్వర్యంలో మండలపరిషత్ కార్యాలయం దగ్గర ఉన్న స్వాతంత్ర్య సమరయోధుల శిలాఫలకం వద్ద నివాళులర్పించారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే నరేంద్రవర్మ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ బాపట్లవాసులు అనేక ఆందోళన కార్యక్రమాలు చేపట్టి బ్రిటీష్ వారి గుండెల్లో రైళ్లు పరిగెత్తించారన్నారు. బాపట్ల నాయకులు సబ్ జడ్జి కుర్చీలో కూర్చొని బాపట్ల స్వతంత్ర పట్టణమని ప్రకటించారన్నారు. ఈ కార్యక్రమంలో ఫోరం కార్యదర్శి డాక్టర్ పీసీ.సాయిబాబు, తహసీల్దార్ టి.కృష్ణకాంత్, నాయకులు పమిడి భాస్కరరావు, గొలపల శ్రీనివాసరావు, హనుమాన్‌జి, బి.బాబురావు, టి.భాస్కరరావు, బాలకోటేశ్వరరావు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

సీసీ డ్రైనేజి కాల్వల నిర్మాణానికి శంకుస్థాపన

పిట్టలవానిపాలెం, ఆగస్టు 12 : మండలంలోని కోడూరు గ్రామపంచాయతీలో నూతనంగా నిర్మించబోయే సీసీ డ్రైనేజి కాల్వల నిర్మాణానికి శంకుస్థాపన కార్యక్రమాన్ని స్థానిక, నాయకులు, అధికారులతో కలిసి బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ సోమవా రం నిర్వహించారు. కోడూరు గ్రామసర్పంచ్ ఐనంపూడి శ్రీనివాసరావు, గ్రామపెద్దలు, గ్రామ పంచాయతీ అధికారులతో కలిసి వేగేశనరేంద్రవర్మ ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. గ్రామ పంచాయతీ నిధులు, ఉపాధిహామీ పథకం నిదులతో డ్రైనేజీ పనులను నిర్వహిస్తున్నట్లు సర్పంచ్ ఐనంపూడి శ్రీనివాసరావు తెలిపారు. గ్రామాలాభివృద్ధికి కూటమి ప్రభుత్వం ముందస్తు ప్రణాళికలతో కృషి చేస్తుందని తెలిపారు. గ్రామపంచాయతీ నిధులు 15లక్షలు, ఉపాధిహామీ పథకం నిదులు 25 లక్షలు మొత్తం రూ.40 లక్షలతో ఈ నిర్మాణ పనులు చేపట్టనున్నారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ కె.పద్మజ, ఆర్‌డబ్ల్యూఎస్ కె.బాగ్యరాజు, ఆర్ మోహనరావు, ఎంఈవో ఉయ్యూరి వెంకటేశ్వరరావు, కార్యదర్శి బి.సుజాత, సంగుపాలెం ఎంపీటీసీ చెన్నుబోయిన గంగయ్య జాలాది లోకరాజ్యుడు, సంగుపాలెం సర్పంచ్ ఎ.శివకుమారి, సచివాలయ కార్యదర్శి షేక్ రబ్బానీ, టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి నాయకులు పాల్గొన్నారు.

భావదేవుని రథనిర్మాణ పనుల పరిశీలన

చారిత్రక ప్రసిద్ధిగాంచిన శ్రీమత్సుందరవల్లీ రాజ్యలక్ష్మీ సమేత క్షీరభావన్నారాయణస్వామి రథనిర్మాణ పనులను ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ పార్టీశ్రేణులతో కలిసి సోమవారం పరిశీలించారు. స్థానిక తూర్పు సత్రంలో ఉన్న నూతన రథాన్ని ఆయన పరిశీలించారు. నిర్మాణ పనులు ఎప్పటికి పూర్తి చేస్తారనేది ఆరా తీశారు. కాగా రథ నిర్మాణానికి కాంట్రిబ్యూషన్‌గా మాజీ ఎమ్మెల్సీ, బీజేపీ నాయకులు అన్నం సతీష్ ప్రభాకర్ రూ.15లక్షల విరాళం అందజేశారు. ఇతర దాతలు నుంచి మరో రూ.15లక్షలు వచ్చాయి. తొలుత కోటిరూపాయలతో నిర్మించ తలపెట్టిన ఈ రథానికి దేవదాయశాఖ సీజీఎఫ్ నుంచి రూ.85లక్షలు కేటాయించగా అన్నం సతీష్ ఇచ్చిన రూ.15లక్షలు కలిపి కోటి రూపాయలతో పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో జనసేనపార్టీ నియోజకవర్గ సమన్వయకర్త నామన వెంకటశివన్నారాయణ, టీడీపీ పట్టణ అధ్యక్షుడు గొలపల శ్రీనివాసరావు, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

శిశుమరణాలపై డీఎంహెచ్‌వో సమీక్ష

బాపట్ల, ఆగస్టు 12 : జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ ఎస్ విజయమ్మ కార్యాలయం నందు సోమవారం శిశుమరణాలపై సమీక్ష నిర్వహించారు. ఆరోగ్య కేంద్రాల వైద్యసిబ్బందితో నిర్వహించిన ఈ సమీక్షలో వైద్యసిబ్బంది, గర్భిణులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు అనంతరం పుట్టిన బిడ్డ గురించి తల్లులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించాలని చెప్పారు. సమావేశంలో జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ టి.వెంకటేశ్వర్లు, డాక్టర్ శేషుకుమార్, డాక్టర్ రోహిణి రత్నశ్రీ పాల్గొన్నారు.

జాతీయ స్థాయి కర్రసాముకు ఎంపికైన విద్యార్థులు


జాతీయ స్థాయి సిలంబంకు ఎంపికైన ఢిల్లీ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు

చెరుకుపల్లి, ఆగస్టు 12 : ఈనెల 11న జరిగిన రాష్ట్రస్థాయి సిలంబం (కర్రసాము)పోటీల్లో, జిల్లా స్థాయి పోటీల్లో ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు విజయం సాధించారు. 14వ రాష్ట్ర స్థాయి పోటీల్లో విజయం సాధించారని స్కూల్ ఛైర్మన్ పైనం ఏడుకొండల్‌రెడ్డి తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర స్థాయిలో జరిగిన అండర్ -11, అండర్ 14, అండర్ -17 విభాగాల్లో గుంటూరు జిల్లాలో జరిగే పోటీల్లో విద్యార్థులు వేదాకచౌదరి, ఎం తేజన్‌రెడ్డి, వై చేతన్, వై రాఘవ, ఆర్ షన్ముఖవంశీ, ఎం యోకనాథ్‌లు ఎంపికయ్యారు. జాతీయ స్థాయి పోటీలు గోవాలో జరగనున్నట్లు చెప్పారు. విద్యార్థులను అభినందించిన వారిలో స్కూల్ వైస్ ఛైర్మన్ గణేష్‌రెడ్డి, ఉపాధ్యాయులు ఉన్నారు.

సమన్వయంతో పనిచేస్తే గ్రామాభివృద్ధి

భట్టిప్రోలు, కొల్లూరు, ఆగస్టు 12 : అధికారులు, ప్రజా ప్రతినిధుల సమన్వయంతో పని చేస్తే గ్రామాభివృద్ధి సాధ్యమవుతుందని ఎంపీపీ దావూరి లలితకుమారి పేర్కొన్నారు. సోమవారం కొల్లూరు, భట్టిప్రోలు మండల పరిషత్ కార్యాలయాల్లో రాష్ట్రీయ గ్రామ స్వరాజ్ అభియాన్‌పై ప్రజా ప్రతినిధులు, కార్యదర్శులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. గ్రామ పంచాయితీ అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించడం, పారిశుధ్య పనులు, సంపద కేంద్రాల నిర్వహణతో పాటు ప్రజలకు స్వచ్ఛ తాగునీటి సరఫరా వంటి కార్యక్రమాలపై శిక్షకులు, ప్రజా ప్రతినిధులు, అధికారులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ ఉదయభాస్కరి, ఇన్‌చార్జి ఎంపీడీవో ఉషారాణి, ఏవో శైలజ, శిక్షకులుగా ఎ.చిన వెంకటేష్‌బాబు, వి.సురేష్‌లు వ్యవహరించారు.

రూరల్ సీఐ హరికృష్ణకు అభినందనలు

కర్లపాలెం, ఆగస్టు 12: మండలంలో శాంతిభద్రతలు సక్రమంగా ఉండటానికి మండల ప్రజలు సహకరించాలని బాపట్ల రూరల్ సీఐగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన హరికృష్ణ అన్నారు. కర్లపాలెం పోలీసుస్టేషన్‌ను సోమవారం సీఐ సందర్శించారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు చేపడుతామన్నారు. సీఐ హరికృష్ణను బాపట్ల తెలుగుదేశంపార్టీ పార్లమెంట్ ఉపాధ్యక్షుడు నక్కల వెంకటస్వామి, నాయకులు మాడా శ్రీనివాసరావులు పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందనలు తెలిపారు.

కార్తీక్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడికి డాక్టరేట్

వేమూరు, ఆగస్టు 12: కోడిపర్రు గ్రామానికి చెందిన కార్తీక్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు నందూరి కార్తీక్ గౌరవ డాక్టరేట్ అందుకున్నారు. తాను స్థాపించిన ఫౌండేషన్ ద్వారా గ్రామాల్లో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించడంతో పాటు పేద విద్యార్థులకు ఆర్థికంగా సహకారం అందించడంతో పాటు ఉచిత విద్యను ప్రోత్సహిస్తున్నారు. దశాబ్దకాలంగా అందిస్తున్న సేవా కార్యక్రమాలను గుర్తించిన మనం ఫౌండేషన్ హైదరాబాద్ వారు కార్తీక్‌కు సోమవారం డాక్టరేట్ ప్రదానం చేశారు.

15న అన్న క్యాంటీన్ ప్రారంభం



పట్టణంలో ప్రారంభానికి సిద్ధమైన అన్న క్యాంటీన్

రేపల్లె, ఆగస్టు 12 : పేదల కడుపు నింపేందుకు కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొస్తున్న అన్న క్యాంటీన్‌ను ఈనెల 15వ తేదీన రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ ప్రారంభిస్తారని టీడీపీ నాయకుడు అనగాని శివప్రసాద్ అన్నారు. సోమవారం అన్న క్యాంటీన్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్న క్యాంటీన్లలో ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం భోజనం, రాత్రి భోజనం రూ.5లకు అందించనున్నారన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ప్రత్యేక దృష్టి సారించి అన్న క్యాంటీన్ ఏర్పాటు చేశారని రేపల్లెలో 15వ తేదీ నుంచి ప్రారంభం కానున్నదని చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

సాదాసీదాగా మండల పరిషత్ సర్వసభ్య సమావేశం


సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ నాంచారమ్మ

కొల్లూరు, ఆగస్టు 12 : మండల పరిషత్ సర్వసభ్య సమావేశం సాదాసీదాగా జరిగింది. సోమవారం మధ్యాహ్నం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ కమ్మెల నాంచారమ్మ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం ఎంపీడీవో లక్ష్మీకుమారి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా ప్రభుత్వ శాఖల అధికారులు సమావేశంలో ప్రగతి నివేదికలను చదివి వినిపించారు. కొల్లూరు కరకట్ట దిగువ నుండి పెసర్లంక అరవింద వారది వరకు ఉన్న ఆర్ అండ్ బీ రహదారి ప్రమాదభరితంగా తయారైందని దానిని పునః నిర్మించాలని ఎన్నిసార్లు చెప్పినా ఎందుకు పట్టించుకోవడం లేదంటూ ఆర్ అండ్ బీ ఏఈ నరసింహారావును ఎంపీటీసీ సుబ్రహ్మణ్యం, లంక గ్రామాల సర్పంచ్‌లు సమావేశంలో ప్రశ్నించారు. రూ.23 లక్షలతో రహదారి నిర్మాణానికి ప్రతిపాదనలు పంపినట్లుగా ఆయన బదులిచ్చారు. సమావేశంలో వైస్ ఎంపీపీ ఎం రాంబాబు, ఎంపీటీసీలు, సర్పంచులు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

హెచ్‌ఐవీపై అవగాహన ర్యాలీ

బాపట్ల, ఆగస్టు 12: ఆంధ్రప్రదేశ్ ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆధ్వర్యంలో హెచ్‌ఐవీపై అవగాహన కల్పించేందుకు నిర్వహిస్తున్న ప్రచార కార్యక్రమంలో భాగంగా సోమవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. బాపట్ల పీఎస్‌కే కళాశాల, సుశీల స్కూల్ అండ్ నర్సింగ్ కళాశాల విద్యార్థినులతో కలిసి నిర్వహించిన ఈ కార్యక్రమంలో ప్రజలకు అవగాహన కల్పిస్తూ ప్లకార్డులు చేతబూని నినాదాలు చేశారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి ఏపీ శాక్స్ సీపీఎం జానీబాషా మాట్లాడుతూ హెచ్‌ఐవీపై విద్యార్థులు అవగాహన కలిగియుండాలన్నారు. గ్రామసిరి డైరెక్టర్ శ్రీనివాసశాస్త్రి మాట్లాడుతూ మనం పోరాడాల్సింది రోగితో కాదు వ్యాధితోనని తెలుసుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పేరలి సునీల్, వెంకట్రావు, సోములు, బాజి, నాగరాజకుమారి, విద్యార్థులు పాల్గొన్నారు.

ఫిర్యాదులను నిర్లక్ష్యం చేస్తే ఉపేక్షించం : ఎస్పీ దూడీ


అర్జీదారుల సమస్యలు అడిగి తెలుసుకుంటున్న ఎస్పీ తుషార్ డూడీ

బాపట్ల, ఆగస్టు 12: ప్రజా సమస్యల పరిష్కారవేదిక కార్యక్రమానికి వచ్చే ఫిర్యాదులు పరిష్కరించటంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఉపేక్షించబోమని ఎస్పీ తుషార్ డూడీ అధికారులను హెచ్చరించారు. జిల్లాపోలీసు కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజాసమస్యల పరిష్కారవేదికకు జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి అర్జీదారులు 49 మంది తమ సమస్యలను ఎస్పీ దృష్టికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా ఎస్పీ వారి సమస్యలను అడిగి తెలుసుకొని పరిష్కరించాలంటూ సంబంధిత పోలీసుస్టేషన్‌ల అధికారులను ఆదేశించారు. భూవివాదాలు, కుటుంబ కలహాలు, ఆర్థికలావాదేవీలు, మోసాలు వంటి పలు సమస్యలపై ఎస్పీ మాట్లాడుతూ ఫిర్యాదులను చట్టపరిధిలో త్వరగా విచారించి నిర్దిష్ట గడువులోగా పరిష్కరిస్తామన్నారు. మహిళా సంబంధిత ఫిర్యాదులపై పోలీసు అధికారులు వేగంగా స్పందించాలన్నారు. పోలీసుస్టేషన్‌లకు వివిధ సమస్యల పరిష్కారం కోసం వచ్చే ఫిర్యాదుదారులపై మర్యాదపూర్వకంగా వ్యవహరించాలన్నారు. ఫిర్యాదుదారుల సమస్యలను పరిష్కరించటంలో నిర్లక్ష్యం చేయరాదని చెప్పారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ టీపీ విఠలేశ్వర్, ఇన్‌స్పెక్టర్ సీహెచ్ సింగయ్య ఇతర పోలీసు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

వేతనాలు పెంచి ఇవ్వాలి : స్వీపర్ల వినతి

బాపట్ల, ఆగస్టు 12: నాలుగు దశాబ్దాలుగా బాపట్ల మున్సిపాలిటిలోని పాఠశాలలో కంటెన్‌జెన్స్ స్వీపర్లుగా పనిచేస్తున్న తమకు వేతనాలు పెంచాలంటూ ప్రజా సమస్యల పరిష్కారవేదికలో కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు. ఇటీవల వరకు రూ.4వేలు మాత్రమే ఇచ్చేవారని ఈ ఏడాది ఫిబ్రవరి నుంచి రూ.5వేలు ఇస్తున్నారని దీనిని మరింతగా పెంచి ఇవ్వాలని వారు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో వెంకటలక్ష్మి, జి.నాగపద్మ, పి.నాగమణి, భాను, జి.కరుణమ్మ, నరసమ్మ తదితరులు ఉన్నారు.

జిల్లాపేరు మార్చి ప్రకటించటం సరికాదు : బీఎస్పీ

స్వాతంత్ర్యదినోత్సవాలకు జిల్లాలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించేందుకు మంత్రుల జాబితా ప్రకటించిన అధికారులు బీఆర్ అంబేద్కర్ కోన సీమ జిల్లా పేరు ప్రకటించకుండా అమలాపురం జిల్లాగా ప్రకటించటం సరికాదని బహుజన సమాజ్‌పార్టీ జిల్లా అధ్యక్షుడు కాగిత కోటేశ్వరరావు నియోజకవర్గ ఇన్‌చార్జి గుదే రాజారావు, తురిమెళ్ళ అమ్మేశ్వరరావులు పేర్కొన్నారు. కావున అధికారులు దీనిని సరిచేసి సర్క్యులర్ విడుదల చేయాలని కోరుతూ సోమవారం ప్రజా సమస్యల పరిష్కారవేదికలో కలెక్టర్‌ను వినతిపత్రం ద్వారా కోరారు.

ధ్వంసమైన తూములు ఆధునీకరించి నీరందించాలి

కూచిపూడి-వేమూరు రోడ్డు విస్తరణ సమయంలో రోడ్డు కింద ఉన్న తూములు ధ్వంసమై ఆయుకట్టు భూములకు నీరురావటంలేదని వేమూరు మండలం పోతుమర్రు గ్రామరైతులు, అమర్తలూరు మండలం మూల్పూరు గ్రామరైతులు ప్రజాసమస్యల పరిష్కారవేదికలో కలెక్టర్‌కు వినతిపత్రం ద్వారా తెలియజేశారు. రైతులు ఆవుల వెంకటేశ్వర్లు, చుండూరు శ్రీనివాసరావు తదితరులు విజ్ఞప్తి చేశారు.

ప్రజా వేదికకు మూడు అర్జీలు


హేలా షారోన్‌కు అర్జీ అందజేస్తున్న నల్లూరి గ్రామస్థులు

రేపల్లె, ఆగస్టు 12: స్థానిక రెవె న్యూ డివిజనల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో మూడు అర్జీలు అందినట్లు అధికారులు తెలి పారు. నల్లూరి నార్త్ గ్రామానికి సంబంధించి శ్మశానం పోరంబోకు డొంక సర్వే చేయించాలని, దట్టింపూడి బుచ్చిరామకృష్ణ, ఇదే గ్రామానికి చెందిన కొల్లి శేషకృష్ణ రొయ్యల చెరువుల సాగు కోసం బోర్ల ద్వారా నీరు తోడుటవల్ల గ్రామంలో మంచినీరు ఉప్పు నీరుగా మారుతుందని గ్రామస్థులు మరో అర్జీ, మోర్తోట నుంచి దివి మారుతి అనే వ్యక్తి రామాలయంకు సంబంధించిన భూమి నందు కంతేటి సాంబశివరావు అనే వ్యక్తి మట్టిని అడ్డంగా వేయడంతో రహదారి రాకపోకలకు అంతరాయం ఏర్పడిందని మట్టి తొలగించాలంటూ ఆర్జీలు అందినట్లు ఆర్డీవో షారోన్ చెప్పారు.

తగ్గిన వరద


కోతకు గురైన గండికి పోసిన కట్ట

కొల్లూరు, ఆగస్టు 12 : కృష్ణానది వరద ప్రవాహం తగ్గుముఖం పట్టింది. సోమవారం సాయంత్రం మండల పరిధిలోని అరవింద వారధి, గాజుల్లంక గ్రామాల వద్ద కృష్ణానది వరద ఉధృతి తగ్గిపోవడం కనిపించింది. అయితే అరవింద వారధి ఎగువన ఉన్న గండి వద్ద పోసిన కట్ట వరద తగ్గే సమయంలో కొంత మేర కోతకు గురైంది. పెసర్లంక గ్రామ సర్పంచ్ మళ్లీ కట్టను పటిష్ట పరిచేందుకు చర్యలు చేపడతామని పేర్కొన్నారు.

దిక్సూచి DIKSUCHI

ఏపీ గిరిజన వర్సిటీలో డిగ్రీ

విజయనగరంలోని కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయం (ఏపీ సీటీయూ)- డిగ్రీ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. బీఎస్సీ, బీబీఏ, బీకాం ప్రోగ్రామ్‌లు అందుబాటులో ఉన్నాయి. ఒక్కో ప్రోగ్రామ్ వ్యవధి నాలుగేళ్లు. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) నిర్వహించిన సీయూఈటీ(యూజీ) 2024లో సాధించిన ర్యాంక్, కౌన్సెలింగ్‌ల ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు. ఇవి ఆనర్స్/ఆనర్స్ విత్ రీసెర్చ్ ప్రోగ్రామ్‌లు.

ప్రోగ్రామ్‌లు: బీఎస్సీ(కెమిస్ట్రీ), బీఎస్సీ(బోటనీ), బీఎస్సీ(ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్), బీఎస్సీ(జియాలజీ), బీబీఏ(టూరిజం అండ్ ట్రావెల్ మేనేజ్‌మెంట్), బీకామ్(ఒకేషనల్).

అర్హత: గుర్తింపు పొందిన బోర్డు నుంచి ఇంటర్/పన్నెండో తరగతి ఉత్తీర్ణులై ఉండాలి. సీయూఈటీ(యూజీ) 2024 అర్హత తప్పనిసరి.

- ★ **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఆగస్టు 16
- ★ **తరగతులు ప్రారంభం:** సెప్టెంబరు 9
- ★ **వెబ్‌సైట్:** www.ctuap.ac.in



ఏఐసీటీఈ సాక్షమ్ స్కాలర్‌షిప్ స్కీమ్



ఆలిండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్(ఏఐసీటీఈ)- 'సాక్షమ్ స్కాలర్‌షిప్ స్కీమ్'ను ప్రకటించింది. టెక్నికల్ ఎడ్యుకేషన్‌పై దివ్యాంగులకు ఆసక్తిని కలిగించి, వారిని ఉన్నత విద్యలో ప్రోత్సహించేందుకు ఈ స్కీమ్‌ను ఉద్దేశించారు. దీని ద్వారా కనీసం 40 శాతం వైకల్యం ఉన్న దివ్యాంగులకు డిప్లొమా, డిగ్రీ కేటగిరీల్లో స్కాలర్‌షిప్‌లు ఇస్తారు. అభ్యర్థులు పదోతరగతి/ఇంటర్ పూర్తిచేసిన రెండేళ్లలోపు ఏఐసీటీఈ గుర్తింపు పొందిన సంస్థలో డిప్లొమా/డిగ్రీ ప్రవేశం పొంది ఉండాలి. కుటుంబ వార్షికాదాయం రూ.8 లక్షలకు మించకూడదు. అకడమిక్ మెరిట్ ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేస్తారు.

అర్హత: డిప్లొమా కేటగిరీకి అప్లయ్ చేసుకోవాలంటే గుర్తింపు పొందిన పాఠశాల నుంచి పదోతరగతి/తత్సమాన పరీక్ష ఉత్తీర్ణులై ఉండాలి. ఈ విద్యా సంవత్సరానికి మూడేళ్ల వ్యవధి గల టెక్నికల్ డిప్లొమా లెవెల్ కోర్సులో ప్రవేశం పొంది ఉండాలి. ఐటీఐ కోర్సు పూర్తిచేసి లేటరల్ ఎంట్రీ ద్వారా డిప్లొమా ద్వితీయ సంవత్సరంలో చేరినవారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.

- డిగ్రీ కేటగిరీకి దరఖాస్తు చేసుకోవాలంటే గుర్తింపు పొందిన బోర్డు నుంచి ఇంటర్/పన్నెండోతరగతి/తత్సమాన పరీక్ష ఉత్తీర్ణులై ఉండాలి. నాలుగేళ్ల వ్యవధి గల టెక్నికల్ డిగ్రీ కోర్సులో ప్రవేశం పొంది ఉండాలి. డిప్లొమా పూర్తిచేసి లేటరల్ ఎంట్రీ ద్వారా డిగ్రీ రెండో సంవత్సరంలో ప్రవేశం పొందినవారు కూడా అర్హులే.
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి ఇతర మెరిట్ స్కాలర్‌షిప్స్ పొందుతున్నవారు, పీఎంఎస్ఎస్ఎస్ స్కీం కింద చదువుకుంటున్నవారు, నాన్ టెక్నికల్ కోర్సుల్లో చేరినవారు, డ్యూయెల్ డిగ్రీ/పీజీ కోర్సుల్లో ప్రవేశం పొందినవారు, ఇతరత్రా స్టయిపెండ్/ఆదాయం పొందుతున్నవారు దరఖాస్తుకు అనర్హులు.

స్కాలర్‌షిప్: ఎంపికైన అభ్యర్థులకు ఏడాదికి రూ.50,000 చెల్లిస్తారు. డిప్లొమా అభ్యర్థులకు మూడేళ్లు, డిగ్రీ అభ్యర్థులకు నాలుగేళ్లు స్కాలర్‌షిప్ ఇస్తారు. లేటరల్ ఎంట్రీకైతే డిప్లొమా అభ్యర్థులకు రెండేళ్లు, డిగ్రీ అభ్యర్థులకు మూడేళ్లు స్కాలర్‌షిప్ అందిస్తారు. స్కాలర్‌షిప్ మొత్తాన్ని ఏటా అభ్యర్థుల బ్యాంక్ ఖాతాలో జమచేస్తారు. ఇందుకోసం బ్యాంక్ అకౌంట్, ఆధార్ కార్డ్ తప్పనిసరి. ఫీజు, వసతి, పుస్తకాలు, కంప్యూటర్ తదితర ఖర్చుల కోసం ఈ స్కాలర్‌షిప్ మొత్తాన్ని వినియోగించుకోవచ్చు. ఏటా చదువులో చూపిన ప్రతిభ ఆధారంగా తరవాతి సంవత్సరాలకు వీటిని కొనసాగిస్తారు.

- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** అక్టోబరు 31
- **వెబ్‌సైట్:** scholarships.gov.in

'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్‌ఎల్ https://ejyothy.com/to0Hw17లో చదవండి.

హైదరాబాద్‌లోని జవహర్‌లాల్ నెహ్రూ టెక్నలాజికల్ యూనివర్సిటీ(జేఎన్‌టీయూహెచ్)కి చెందిన డైరెక్టరేట్ ఆఫ్ ఇన్నోవేటివ్ లెర్నింగ్ అండ్ టీచింగ్(డీఐఎల్‌టీ)- ఆన్‌లైన్ సర్టిఫికెట్ కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తు గడువు పొడిగించింది. ఒక్కో కోర్సు వ్యవధి ఆర్నెల్లు. ప్రతి కోర్సులో మూడు థియరీ సబ్జెక్టులు ఉంటాయి. ఒక్కో సబ్జెక్ట్‌కు రెండు నెలల సమయం, 24 తరగతులు, మూడు క్రెడిట్‌లు నిర్దేశించారు. సాయంత్రం ఆరున్నర నుంచి ఎనిమిదిన్నర వరకు ఆన్‌లైన్ సెషన్స్ ఉంటాయి. కనీసం 75 శాతం అటెండెన్స్ తప్పనిసరి. అదనంగా ఒక నెల ప్రాజెక్ట్ వర్క్ చేయాల్సి ఉంటుంది. దీనికి ఆరు క్రెడిట్‌లు ఉంటాయి. కోర్సులో భాగంగా అసైన్‌మెంట్‌లు, ఎండ్ ఎగ్జామినేషన్ ఉంటాయి. అసైన్‌మెంట్‌లకు 40 శాతం, ఎండ్ ఎగ్జామినేషన్‌కు 60 శాతం వెయిటేజీ ఇస్తారు. ఫ్యాకల్టీ మెంబర్లు, ఉద్యోగస్తులు, విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. ఫస్ట్ కం ఫస్ట్ సర్వ్ పద్ధతిలో అడ్మిషన్స్ ఇస్తారు. యూనివర్సిటీకి చెందిన టీచింగ్& నాన్ టీచింగ్ సిబ్బంది, అకడమిక్ స్టూడెంట్స్‌కు కోర్సు ఫీజులో 40 శాతం రాయితీ లభిస్తుంది.

జేఎన్‌టీయూహెచ్‌లో ఆన్‌లైన్ సర్టిఫికెట్ కోర్సులు

క్లౌడ్ అండ్ డెవోప్స్ కోర్సు: ఇందులో క్లౌడ్ టెక్నాలజీ ఏడబ్ల్యూఎస్ & మైక్రోసాఫ్ట్ అజ్యూర్, కంటిన్యూయస్ ఇంటిగ్రేషన్/కంటిన్యూయస్ డిప్లాయ్‌మెంట్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రొవిజనింగ్ సబ్జెక్టులు ఉంటాయి.

డేటా సైన్స్ అండ్ జనరేటివ్ ఏఐఎల్ఎల్ఎమ్ కోర్సు: ఇందులో పైథాన్ ప్రోగ్రామింగ్, మెషిన్ లెర్నింగ్-డీప్ లెర్నింగ్, జనరేటివ్ ఏఐ అండ్ లార్జ్ లాంగ్వేజ్ మోడల్స్ సబ్జెక్టులు ఉంటాయి.

అర్హత: గుర్తింపు పొందిన కళాశాల నుంచి డిప్లొమా/యూజీ/పీజీ పూర్తిచేసిన/చదువుతున్నవారు దరఖాస్తు చేసుకోవచ్చు. కంప్యూటర్స్‌కు సంబంధించి ప్రాథమిక పరిజ్ఞానం, ఏదేని ప్రోగ్రామింగ్ లాంగ్వేజ్‌పై అవగాహన తప్పనిసరి.

- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఆగస్టు 31
- **వెబ్‌సైట్:** www.jntuh.ac.in

సీసీఎంబీలో పీహెచ్‌డీ

హైదరాబాద్-హబ్సిగూడలోని సెంటర్ ఫర్ సెల్యులర్ అండ్ మాలిక్యులర్ బయాలజీ(సీసీఎంబీ)- పీహెచ్‌డీ 2025 జనవరి సెషన్ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ప్రోగ్రామ్‌లో భాగంగా మోడరన్ బయాలజీకి సంబంధించిన అంశాల్లో పరిశోధనలు చేయాల్సి ఉంటుంది. కంప్యూటర్ బేస్డ్ రిటెన్ టెస్ట్ లేదా రిమోట్ ప్రొక్టోర్డ్ ఆన్‌లైన్ టెస్ట్, ఇంటర్వ్యూల ద్వారా అభ్యర్థులను ఎంపిక చేస్తారు.

అర్హతలు: గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి ఏదేని సైన్స్ విభాగంలో కనీసం 55 శాతం మార్కులతో మాస్టర్స్ డిగ్రీ పూర్తిచేసి ఉండాలి. అభ్యర్థులకు సీఎస్ఐఆర్/యూజీసీ/డీబీటీ/డీఎస్‌టీ నుంచి వ్యాలిడ్ జేఆర్ఎఫ్/ఎస్ఆర్ఎఫ్ లేదా డీబీటీ-బీఈటీ/ఇన్‌స్పయిర్/ఆర్‌జీఎస్ఎఫ్ నుంచి ఫెలోషిప్ అర్హత పొంది ఉండాలి. ➡ **చివరి తేదీ:** సెప్టెంబరు 16
➡ **వెబ్‌సైట్:** www.ccmb.res.in

నవ్య | చిత్రజ్యోతి

అది నా దురదృష్టం



మహేశ్‌బాబు, సోనాలి బింద్రే జంటగా కృష్ణవంశీ తెరకెక్కించిన బ్లాక్‌బస్టర్ సినిమా 'మురారి'. ఇటీవలే ఆ సినిమా రీ రిలీజై క్రేజీ కలెక్షన్లు సాధిస్తున్న తరుణంలో దర్శకుడు సోషల్ మీడియాలో అభిమానులతో ముచ్చటించారు. వారితో ఓ ఆసక్తికర విషయాన్ని పంచుకున్నారు. "పవన్‌కల్యాణ్‌తో సినిమా చేయాలనుకున్నాను. ఆయనకు కథ కూడా చెప్పాను. కానీ అది కార్యరూపం దాల్చలేదు. ఒకవేళ ఆయనతో సినిమా చేసి ఉంటే.. అది పెద్ద హిట్టయ్యేది. ఈ విషయంలో నాది దురదృష్టం అనుకోవాలి" అని పేర్కొన్నారు. అలాగే, మహేశ్‌బాబు తనయుడు గౌతమ్ హీరోగా 'మురారి' సీక్వెల్ ఉంటుందా అని అభిమానులు ఆయన్ని అడిగారు. "ఆ సీక్వెల్ విషయం గౌతమ్ తల్లిదండ్రుల నిర్ణయంపై ఆధారపడి ఉంటుంది" అని కృష్ణవంశీ బదులిచ్చారు.

లేటెస్ట్ అప్‌డేట్



నందమూరి బాలకృష్ణ నటిస్తున్న తాజా చిత్రం ఎన్‌బీకే 109కి సంబంధించి లేటెస్ట్ అప్‌డేట్ వచ్చేసింది. బాబీ దర్శకత్వంలో సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ప్రస్తుతం రాజస్థాన్‌లో ఈ సినిమా కోసం తీస్తున్న కీలక సన్నివేశాల చిత్రీకరణ పూర్తయిందనీ సోమవారం సోషల్ మీడియా ద్వారా దర్శకుడు బాబీ వెల్లడించారు. 'బాలకృష్ణ ఎనర్జీనీ, అద్భుతమైన అభినయాన్ని ఈ సినిమాలో చూస్తారు. థియేటర్లలో ఆ అనుభూతి కోసం సిద్ధంగా ఉండండి' అని ఆయన పేర్కొన్నారు. ఈ సినిమా టైటిల్ గురించి రకరకాల ఊహాగానాలు వినిపిస్తున్నాయి. అందుకే టైటిల్ ఎప్పుడు ప్రకటిస్తారా అని అభిమానులు ఎంతో ఆసక్తితో ఎదురు చూస్తున్నారు. ఈ విషయం మీద క్లారిటీ ఇచ్చారు దర్శకుడు బాబీ. త్వరలోనే టైటిల్, టీజర్ విడుదలవుతాయని వెల్లడించారు. బాలీవుడ్ నటుడు బాబీ డియోల్ విలన్ నటిస్తున్న ఈ చిత్రానికి తమన్ సంగీత దర్శకుడు.

ఏడ్చుకుంటూ ఇంటికి...

వరుస చిత్రాలతో దూసుకుపోతున్నారు స్టార్ హీరోయిన్ రష్మిక మందన్న. ఇటీవల జరిగిన ఓ ఇంటర్వ్యూలో తన కెరీర్ తొలినాళ్లను ఆమె గుర్తుచేసుకున్నారు. "నటిగా నాకు మొదట్లో అవకాశాలు అంత సులువుగా వచ్చేవి కావు. ఆడిషన్లకు హాజరు కావడం.. అందులో సెలక్ట్ కాలేదని తెలిసి ఇంటికి ఏడ్చుకుంటూ వెళ్లిన సందర్భాలు ఎన్నో ఉన్నాయి. ఆ ప్రయత్నాల్లో ఉండగా.. ఓ సినిమాలో నటిగా అవకాశం రావడంతో ఎగిరి గంతేశా. కానీ ఆ ప్రాజెక్ట్ కొన్నాళ్లకే ఆగిపోయింది. ఆ తర్వాత కూడా నాకు అవకాశాలు వెంట వెంటనే ఏమీ రాలేదు. దాదాపు పాతిక ఆడిషన్లలో తిరస్కరణకు గురయ్యాను. అలా ఎన్నో సవాళ్లను ఎదుర్కొన్నా, ఆత్మస్థైర్యంతో ముందడుగు వేసేదాన్ని" అని చెప్పారు.



జాతి కోసం సాహస పోరాటం



తమిళ హీరో సూర్య నటిస్తున్న భారీ ప్రతిష్ఠాత్మక చిత్రం 'కంగువ' అక్టోబర్ 10న విడుదల కానుంది. దిశా పటానీ, బాబీ డియోల్ కీలక పాత్రలు పోషిస్తున్న ఈ పీరియాడికల్ యాక్షన్ ఫిల్మ్‌ను దర్శకుడు శివ రూపొందిస్తున్నారు. కేఈ జ్ఞానవేల్ రాజా, వంశీ, ప్రమోద్ నిర్మాతలు. మెస్మరైజింగ్ మేకింగ్‌తో రూపుదిద్దుకుంటున్న 'కంగువ' ట్రైలర్‌ను సోమవారం విడుదల చేశారు. యుద్ధాలు, ఆక్రమణలు చేస్తూ ఎదురొచ్చిన వారిని క్రూరంగా చంపే భయంకరమైన విలన్‌గా బాబీ డియోల్ ఈ ట్రైలర్‌లో కనిపించారు. తన జాతి కోసం, తనవారి కోసం సాహసోపేతమైన పోరాటాలు చేసే ధీరుడిగా సూర్య పాత్ర ఉంది. భారీ నౌకలపై దాడి చేసే సన్నివేశాలు, హై క్వాలిటీ విజువల్ ఎఫెక్ట్స్ సినిమాకు ప్రధాన ఆకర్షణలు నిలుస్తాయి. ఇండియన్ ఫిల్మ్ ఇండస్ట్రీ నుంచి వస్తున్న మరో చిత్రం 'కంగువ' కోసం ప్రేక్షకులు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు.

బట్టతలలా కనిపించాలి అంటే సరే అన్నా



'**వి**జయవాడ రావడం చాలా హ్యాపీగా ఉంది. డైట్‌ను పక్కన పెట్టి 'బాబాయ్ హోటల్' లో ఇడ్లీలు తినేశా. నా 'అపరిచితుడు' సినిమా మిగిలిన ప్రాంతాలకంటే విజయవాడలోనే ఎక్కువ రోజులు ఆడింది మంచి సినిమాను తెలుగు ప్రేక్షకులు ఎంత సపోర్ట్ చేస్తారో నాకు తెలుసు' అన్నారు హీరో విక్రమ్. ఆయన నటించిన పీరియాడిక్ యాక్షన్ ఫిల్మ్ 'తంగలాన్' ఈ నెల 15న విడుదల కానుంది. ఈ సందర్భంగా హీరోయిన్ మాళవిక మోహనన్, హాలీవుడ్ నటుడు డేనియల్, నిర్మాత ధనుంజయన్‌తో కలసి ప్రమోషన్స్ నిమిత్తం విజయవాడ వెళ్లిన విక్రమ్ మాట్లాడుతూ 'నేను విభిన్న పాత్రలు పోషించిన చిత్రాలన్నీ మీరు ఆదరించారు. ఈ సినిమాలోనూ కొత్తగా కనిపిస్తా. బట్టతలగా కనిపించే గెటప్‌లో కనిపించాలని దర్శకుడు పా.రంజిత్ చెప్పగానే సరేనన్నా. ఈ సినిమాలో రెగ్యులర్ ఫైట్లు, పాటలు ఉండవు. భావోద్వేగాలు బాగా ఉన్న కథ ఇది. 'తంగలాన్' మిమ్మల్ని సరికొత్త లోకంలోకి తీసుకెళుతుంది' అన్నారు.

గురువారం నాడే విడుదల

సినిమాలకూ.. శుక్రవారానికి ప్రత్యేకమైన అనుబంధం ఉంది. ఎన్నో ఆశలతో తెరకెక్కించిన సినిమాలను ఆ రోజున విడుదల చేసి బాక్సాఫీస్ వద్ద తమ అదృష్టాన్ని పరీక్షించుకుంటుంటారు చిత్ర ప్రముఖులు. పండగ సీజన్లలో లేదా కొన్ని ప్రత్యేక సందర్భాల్లో తప్పించి శనివారం, గురువారం, బుధవారం వంటి ఇతర తేదీల్లో సినిమాలు విడుదలవ్వడం అరుదు. కానీ ఈ ఏడాది అనేక సినిమాలు శుక్రవారం ట్రెండ్‌ను బ్రేక్ చేసి.. గురువారాన్ని విడుదల తేదీగా మార్చుకున్నాయి.. ఆ చిత్రాలివే.





నాని నటించిన లేటెస్ట్ చిత్రం 'సరిపోదా శనివారం'. ప్రియాంక అరుల్ మోహన్ హీరోయిన్. వివేక్ ఆత్రేయ దర్శకత్వంలో విభిన్న కథాంశంతో తెరకెక్కిందీ చిత్రం. అధిక కోపం గల ఓ యువకుడు.. తన కోపాన్ని నియంత్రించుకోవడానికి ప్రతీ శనివారం ఏం చేశాడనేది ఈ సినిమా కథ. ఈ నెల 29న గురువారం విడుదవుతున్న ఈ చిత్రంలో నాని పాత్రలో అనేక రకాల షేడ్స్ ఉంటాయని మేకర్స్ తెలిపారు. ఇంతకు ముందు వీరి కలయికలో వచ్చిన 'అంటే సుందరానికీ' సినిమా..కమర్షియల్‌గా పెద్ద విజయం సాధించకపోయినా.. విమర్శకుల ప్రశంసలను పొందింది.





డ్యూయల్ రోల్‌లో...

తమిళ కథానాయకుడు విజయ్ డ్యూయల్ రోల్‌లో నటిస్తున్న చిత్రం 'గోట్' (గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్ టైమ్). మీనాక్షీ చౌదరి కథానాయిక. వెంకట్ ప్రభు దర్శకత్వంలో వస్తున్న ఈ చిత్రం వినాయక చవితి సందర్భంగా సెప్టెంబరు 5న గురువారం విడుదలవుతోంది. భారీ అంచనాలతో తెరకెక్కుతున్న ఈ చిత్రంలో యాక్షన్ సన్నివేశాలకి అధిక ప్రాధాన్యం ఉండనుంది.

వేటగాడిగా రజనీ..

'జై భీమ్' ఫేమ్ టి.జె.జ్ఞానవేల్ దర్శకత్వంలో రజనీకాంత్ 'వేట్టయాన్' చిత్రంలో నటిస్తున్నారు. ఇందులో అమితాబ్ బచ్చన్, రానా దగ్గుబాటి, ఫహాద్ ఫాజిల్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఇందులో ఓ రిటైర్డ్ పోలీస్ ఆఫీసర్ పాత్రలో రజనీ కనిపించనున్నారు. ఈ సినిమా దసరా సందర్భంగా అక్టోబరు 10న గురువారం ప్రేక్షకులను పలకరించనుంది. 'జైలర్'తో సూపర్ హిట్ కొట్టి మంచి ఫామ్‌లో ఉన్న రజనీకాంత్‌కు ఈ సినిమా అంతకుమించిన సక్సెస్ ఇస్తుందని ట్రేడ్ వర్గాలు అంచనా వేస్తున్నాయి.

మాస్ ఎంటర్టైనర్

విశ్వక్ సేన్ కథానాయకుడిగా రవితేజ ముళ్లపూడి దర్శకత్వంలో తెరకెక్కుతోన్న మాస్ ఎంటర్టైనర్ 'మెకానిక్ రాకీ'. సమాజంలో జరుగుతున్న ఓ కుంభకోణం నేపథ్యంలో ఈ సినిమా కథాంశం సాగనుంది. ఇందులో విశ్వక్ సరసన మీనాక్షీ చౌదరి, శ్రద్ధా శ్రీనాథ్ నటిస్తున్నారు. దీపావళి కానుకగా ఈ సినిమా అక్టోబరు 31న గురువారం విడుదల కానుంది.

బయోపిక్‌లో శివకార్తీకేయన్



వైవిధ్యమైన చిత్రాలతో ప్రేక్షకులను అలరించే తమిళ నటుడు శివ కార్తీకేయన్. రాజ్‌కుమార్ పెరియస్వామి దర్శకత్వంలో ఆయన నటిస్తున్న బయోపిక్ 'అమరన్' వహిస్తున్నారు. ఈ సినిమా అమరులైన మేజర్ ముకుంద్ వరదరాజన్ జీవితం ఆధారంగా తెరకెక్కుతోంది. సాయిపల్లవి హీరోయన్‌గా నటిస్తున్న ఈ చిత్రం దీపావళి కానుకగా అక్టోబరు 31 గురువారం విడుదలవుతోంది.

'కల్కి' కూడా..

ప్రభాస్ కథానాయకుడిగా నటించిన 'కల్కి 2898 ఏ.డీ' చిత్రం గురువారం రిలీజై సంచలన విజయం సాధించిన సంగతి తెలిసిందే. అలాగే స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఈ గురువారం (ఆగస్టు 15)న కూడా డజనుకు పైగా చిత్రాలు సందడి చేయనున్నాయి. గురువారం సెంటిమెంటు ఈ సినిమాలకు కలసి వస్తుందేమో చూడాలి.



ప్రేమ, వినోదం.. ఉత్సవం

దిలీప్ ప్రకాశ్, రెజీనా కసాండ్రా లీడ్ రోల్స్ పోషించిన 'ఉత్సవం' చిత్రం సెప్టెంబర్ 13న విడుదల కానుంది. ప్రేమ, వినోదం, భావోద్వేగం.. అంశాలతో రూపుదిద్దుకొన్న కంప్లీట్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ ఇదని దర్శకుడు అర్జున్ సాయి చెప్పారు. ప్రకాశ్‌రాజ్, నాజర్, రాజేంద్రప్రసాద్, బ్రహ్మానందం, అలీ, ప్రేమ, ఎల్బీ శ్రీరామ్ తదితరులు నటించిన ఈ చిత్రాన్ని రెండు తెలుగు రాష్ట్రాల్లో మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ విడుదల చేస్తోందని నిర్మాత సురేశ్ పాటిల్ చెప్పారు.

ఇన్ ప్రోగ్రెస్

ముఫాసా కోసం షారుఖ్



ప్రపంచ వ్యాప్తంగ ఎంతో మంది ప్రేక్షకుల అభిమానాన్ని పొందిన 'ముఫాసా ది లయన్ కింగ్' ఫ్రాంచైజ్‌లోని కొత్త సినిమా డిసెంబర్ 20న విడుదల కానుంది. ఈ సినిమా కోసం తొలిసారిగా బాలీవుడ్ హీరో షారుఖ్ ఖాన్ తన ఇద్దరు కుమారులతో కలసి డబ్బింగ్ చెబుతున్నారు. సినిమాలోని ప్రధాన పాత్ర ముఫాసాకు షారుఖ్ గొంతు అరువిస్తుండగా, ఆర్యన్ ఖాన్ సింబా పాత్రకి, చిన్నప్పటి ముఫాసా పాత్రకు షారుఖ్ చిన్న కుమారుడు అబ్రమ్ ఖాన్ డబ్బింగ్ చెబుతున్నారు. ఇంగ్లీష్, హిందీ, తెలుగు, తమిళ భాషల్లో ఈ సినిమా విడుదల కానుంది

ఫ్యామిలీ ఎంటర్‌టైనర్



తన దగ్గర అసోసియేట్ డైరెక్టర్‌గా పని చేసిన సాయి కిశోర్ దర్శకుడిగా మారి రూపొందించిన 'ధూమ్‌ధాం' చిత్రం టీజర్‌ను హీరో గోపీచంద్‌తో కలసి విడుదల చేశారు దర్శకుడు శ్రీను వైట్ల. గోపీ మోహన్ ఈ సినిమాకు కథ, స్క్రీన్‌ప్లే అందించారు. చేతన్ కృష్ణ, హెబ్బా పటేల్ జంటగా నటించారు. ఈ సందర్భంగా నిర్మాత ఎమ్మెస్ రామ్‌కుమార్ మాట్లాడుతూ 'చిత్ర పరిశ్రమలో నాకు ఉన్న మిత్రుల్లో హీరో గోపీచంద్ ఒకరు. చక్కని ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా సినిమాను తీర్చిదిద్దాం. భారీ బడ్జెట్‌తో లావిష్‌గా నిర్మించాం. విదేశాల్లో కూడా షూటింగ్ చేశాం. సెప్టెంబర్ 13న విడుదల చేస్తున్నాం' అని చెప్పారు.



స్వాతంత్రం.. మా స్వాతంత్ర్యం

తన ఆహార విధానంతో ఆరోగ్య డైట్ ప్రారంభించిన లక్ష్మణ్ పూడి తన మాతృ సంస్థ ప్రజానాట్య మండలి రూపకల్పనలో ఎం. శేషగిరిరాసిన 'స్వాతంత్రం.. మా స్వాతంతీర్యం' పాటను పాడారు. శ్రీనివాస్ నందుల రాసిన ఈ పాటను తమ్మారెడ్డి భరద్వాజ విడుదల చేశారు. దేశం మీద ప్రేమతో నిరక్షరాస్యులను మేల్కొల్పడానికి ఈ పాటను రూపొందించినట్లు లక్ష్మణ్ పూడి చెప్పారు.

సీనియర్ నటుడు నరేశ్ తన యాభై ఏళ్ల నట జీవితాన్ని పూర్తి చేసుకున్న సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి జాకీ ష్రాఫ్, పూనమ్ ధిల్లాన్, జయసుధ, సుహాసిని, కుష్బూ, సాయి దుర్గాతేజ్, మంచు మనోజ్, నారా రోహిత్, దర్శకుడు మారుతి తదితరులు హాజరయ్యారు. హీరో కృష్ణ, విజయనిర్మలతో ఏర్పాటు చేసిన స్ఫూర్తి వనాన్ని ఈ సందర్భంగా నరేశ్ ప్రారంభించారు.



'అతడు' సినిమా చూసేవాడ్ని



'**మ**హారాజా' చిత్రంతో సూపర్ హిట్ అందుకున్నారు తమిళ నటుడు విజయ్ సేతుపతి. తెలుగులోనూ మంచి ఫాలోయింగ్ ఉన్న ఆయన.. ఇటీవల జరిగిన ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ "మహేశ్‌బాబు కథానాయకుడిగా నటించిన 'అతడు' సినిమా నాకెంతో ఇష్టం. జీవితంలో ఒడిదుడుకులకు లోనైన సమయాల్లో ఆ సినిమాను రిపీట్ మోడ్‌లో చూసేవాడ్ని. ఆ సినిమాలో మహేశ్ నటన అద్భుతం. ఆయన పలికిన ప్రతీ డైలాగ్, సన్నివేశం నాకు బాగా గుర్తుండిపోతుంది. త్రివిక్రమ్ దర్శకత్వ పటిమ.. ఆయన రాసిన సన్నివేశాలతో తెరపై భావోద్వేగాలు బాగా పండాయి. ముఖ్యంగా హీరోహీరోయిన్ల కెమిస్ట్రీ, బ్రహ్మానందం కామెడీ, పాటలు నాకు బాగా నచ్చాయి" అని తెలిపారు.

డిగ్రీ విద్యార్థి హత్య కేసులో నిందితుల అరెస్ట్

పరారీలో ఉన్న ఇద్దరి కోసం గాలింపు

వారంతా పాత నేరస్తులే

వివరాలు వెల్లడించిన ఏఎస్పీ విఠలేశ్వర్



వివరాలు వెల్లడిస్తున్న అడిషనల్ ఎస్పీ విఠలేశ్వర్

చీరాలటౌన్, ఆగస్టు 12 : డిగ్రీ విద్యార్థినిని అతి కిరాతకంగా మట్టుపెట్టిన నిందితులను చీరాల టూటౌన్ పోలీసులు అరెస్ట్ చేశారు. సోమవారం రాత్రి టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఏఎస్పీ విఠలేశ్వర్ వివరాలను వెల్లడించారు. చీరాల మండల పరిధిలోని ఈపూరుపాలెం ఈసూబ్‌నగర్‌కు చెందిన సయ్యద్ అమీన్ ఆరీఫ్(18) పట్టణంలోని ప్రైవేటు కళాశాలలో డిగ్రీ మొదటి సంవత్సరం చదవుతున్నాడు. కుటుంబంలో అధికంగా ఆర్మీ ఉద్యోగులు ఉండడంతో చిన్ననాటి నుంచే ఆరీఫ్ ఆర్మీపై మక్కువ పెంచుకున్నాడు. దీంతోనే ప్రతిరోజూ శరీరదారుఢ్యాన్ని పెంచుకునేందుకు చీరాల్లో జిమ్‌కు వెళ్లేవాడు. ఈక్రమంలోనే ఈనెల 6వ తేదీ రాత్రి జిమ్ ముగించుకుని మిత్రుడు మనోజ్ (బైక్)తో కలిసి ఆరీఫ్ (సైకిల్‌పై) ఈపూరుపాలెంలో ఇంటికి వెళుతున్నారు. అయితే చీరాల - బాపట్ల రోడ్డులోని ఆదినారాయణపురం వద్దకు వచ్చేసరికి వెనుక నుంచి కారులో బాపట్ల వైపు వెళుతున్న పాత నేరస్తులు వెదుళ్లపల్లికి చెందిన సందీప్ హారన్ కొట్టాడు. ఈక్రమంలోనే వీరి మధ్య వివాదం రేగింది. అదికాస్త పెద్దదవడంతో సందీప్‌తో పాటు కారులో ఉన్న బాపట్లకు చెందిన జిలానీ, చీరాల పాపరాజుతోటకు చెందిన మహేంద్ర ఒకరి తరువాత ఒకరు కత్తితో పొడిచి అతి కిరాతకంగా హత మార్చి పరారయ్యారు. దీనికి కారులో ఉన్న మిగిలిన ఐదుగురు సహకరించారు. ఆరీఫ్ మిత్రుడు మనోజ్ ఫిర్యాదు మేరకు కారులో ఉన్న ఎనిమిది మందిపై హత్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేట్టారు. ఎట్టకేలకు సోమవారం వారిని అరెస్ట్ చేసి హత్యకు పాల్పడిన కత్తిని ఆరుగురిని అరెస్ట్ చేశారు. అయితే మహేంద్ర, రామకృష్ణాపురానికి చెందిన కర్రెద్దుల వంశీ కోసం గాలింపు చర్యలు సాగుతున్నట్లు ఏఎస్పీ వివరించారు. సందీప్. జిలానీ, షేక్ మహ్మద్ రియాజ్, పాశం లక్ష్మీనారాయణ, దేవరకొండ శ్రీను, అంగడి సుకుమార్‌ను అరెస్ట్ రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరు పరచనున్నారు. వీరిలో సందీప్, జిలానీ, మహేంద్రకు ఒక్కొక్కరిపై సుమారు 12 కేసులు, రౌడీషీట్‌లు ఉన్నట్లు ఏఎస్పీ తెలిపారు. కేసునే ఛేదించేందుకు కృషి చేసిన డీఎస్పీలు జగదీష్‌నాయక్, మురళీకృష్ణ, సీఐలు సోమశేఖర్, శ్రీనివాసరావు, సత్యనారాయణ, ఇంకొల్లు, అద్దంకి, బాపట్ల టౌన్, ఎస్‌బీ, సీసీఎస్ టీంను ఎస్పీ తుషార్ డూడీ ప్రత్యేకంగా అభినందించినట్లు ఏఎస్పీ విఠలేశ్వర్ తెలిపారు.

సూక్తి సుధలు ఖండకావ్యం ఆణిముత్యం



ఖండకావ్యాన్ని ఆవిష్కరిస్తున్న మద్రాస్ వర్సిటీ తెలుగు శాఖాధిపతులు విస్తాలి శంకరరావు

అద్దంకిటౌన్, ఆగస్టు 12 : సూక్తి సుధలు ఖండకావ్యం ఒక ఆణిముత్యం అని, ఇది అన్ని వయస్సులవారు ఆచరించదగిన పారాయణ గ్రంథమని మద్రాస్ యూనివర్సిటీ తెలుగు శాఖాధిపతులు ఆచార్య విస్తాలి శంకరరావు అన్నారు. సోమవారం అద్దంకిలోని శ్రీ ప్రకాశం ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణంలో రచయిత విద్వాన్ జ్యోతి చంద్రమౌళి రచించిన సూక్తి సుధలు ఖండకావ్యం ఆవిష్కరణ కార్యక్రమం హెచ్‌ఎం డీఎస్ పద్మావతి అధ్యక్షతన జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన విస్తాలి శంకరరావు గ్రంథాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శంకరరావు మాట్లాడుతు ఇటువంటి గ్రంథాన్ని తనకు విద్యాబుద్ధులు నేర్పిన గురువుకు అంకితం ఇవ్వడం అదర్శవంతమైనదన్నారు. గ్రంథ సమీక్షకులు డాక్టర్ యూ దేవపాలన మాట్లాడుతూ ఈ గ్రంథం నేటి సమాజంలో జరిగే అసమానతలకు అర్థంపట్టే విధంగా ఉందని, పద్యాలు సమాజంలో జరిగే మార్పులు, నేటి చరిత్రను గుర్తు తెస్తున్నాయని అన్నారు. మరో సమీక్షకులు అన్నమనేని వెంకట్రావు మాట్లాడుతూ ఈ గ్రంథం నాటి నుంచి నేటి వరకూ జరుగుతున్న అఘాత్యాలను సందేశాత్మకంగా రచయిత చెప్పారన్నారు. అనంతరం రచయిత జ్యోతి చంద్రమౌళిని అతిథులు, పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది, ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో వీరవల్లి సుబ్బారావు (రుద్రయ్య), డాక్టర్ చుక్కా నాగభూషణం, డాక్టర్ కాకాని సుధాకర్, దివాకర్ దత్తు, పీఈటీ ఎం.నాగయ్య, వీరయ్య, వీరాంజనేయులు, నాగేశ్వరరావు, శ్రీమన్నారాయణమూర్తి, రమేష్, ఉపాధ్యాయుడు వీలక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

పూర్తి స్థాయి వైకల్యానికి పెన్షన్ పెంచి ఇవ్వాలి



మనోజ్‌కుమార్‌ని ఎత్తుకొని ప్రజా సమస్యల పరిష్కార వేదికకు తీసుకెళుతున్న కుటుంబ సభ్యులు

బాపట్ల, ఆగస్టు 12 : పూర్తి స్థాయి అంగవైకల్యంతో ఉన్న తన బిడ్డకు పెన్షన్ 15వేల రూపాయలు వచ్చేవిధంగా చూడలంటూ ప్రజాసమస్యల పరిష్కార వేదికలో సోమవారం కలెక్టర్ జె.వెంకటమురళీని బాధిత కుటుంబ సభ్యులు కోరారు. జిల్లాలోని ఇంకొల్లు మండల కేంద్రంలోని స్టాలిన్‌పేటకు చెందిన వై.మనోజ్‌కుమార్‌కు 90శాతం వైకల్యం ఉన్నట్లు సర్టిఫికెట్ ఉందని, ప్రస్తుతం 100శాతం వైకల్యంతో ఉన్న మనోజ్‌కుమార్‌కు పెన్షన్ పెంచి ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఇంకొల్లు నుంచి ఆటోలో తీసుకొచ్చి చేతులపై ఎత్తుకొని కలెక్టర్ వద్దకు తీసుకెళ్ళటం ప్రతిఒక్కరినీ కలిచివేసింది.

ఉద్యోగాల పేరిట డబ్బులు వసూలు చేసిన వైసీపీ నాయకురాలిపై చర్యలు తీసుకోవాలి

బాపట్ల, ఆగస్టు 12 : ఉద్యోగాలు ఇప్పిస్తామని నమ్మబలికి తమ వద్ద 17లక్షల75వేల రూపాయలు వసూళ్లు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ప్రజా సమస్యల పరిష్కారవేదికలో ఎస్పీ తుషార్ డూడీని వినతిపత్రం ద్వారా కోరారు. వివరాల్లోకి వెళితే... జిల్లాలోని ఇంకొల్లు మండలం ఇడుపులపాడు గ్రామానికి చెందిన దొంతాల మహేష్, దొంతా మనోహర్‌లకు ఉద్యోగాలిప్పిస్తానని చెప్పి ఒంగోలుకు చెందిన వైసీపీ నాయకురాలు షేక్ సల్మాసుల్తానా డబ్బులు తీసుకుంది. విడతల వారీగా డబ్బులు తీసుకొని మోసగించిన ఆమెను అడిగితే కుమారుడు, భర్త వచ్చి చంపుతామని బెదిరిస్తున్నట్లు ఎస్పీకి వివరించారు. గత ఏడాది ఏప్రిల్‌లో రెవెన్యూ ఉద్యోగాలిస్తామని నమ్మబలికి సంతనూతలపాడు మాజీ ఎమ్మెల్యే సుధాకర్‌బాబు పీఏ బండారు సురేష్ ద్వారా ఉద్యోగాలు అధికారికంగా ఇస్తామని చెప్పి నమ్మించింది. విలేజ్ రెవెన్యూ ఆఫీసర్ పోస్టుకు 15 లక్షల రూపాయలు, జూనియర్ అసిస్టెంట్ పోస్టుకు 5లక్షల రూపాయలు కట్టాలని చెప్పి తమ వద్ద రూ.17.75లక్షలు వసూలు చేసిందని ఆరోపించారు. తీరా ఉద్యోగం కోసం వెళితే ఫేక్ జాబ్ అపాయింట్‌మెంట్ ఆర్డర్ కాపి ఇచ్చారన్నారు. ఉద్యోగం వచ్చిందన్న ఆనందంలో ఆర్డర్ కాపీ తీసుకొని బంధువులు, స్నేహితులకు పంపించామన్నారు. తీరదానిని పరిశీలిస్తే ఫేక్ జాబ్‌ఆర్డర్ కాపీగా గుర్తించామని చెప్పారు. దీనిపై సంబంధిత మహిళను ప్రశ్నించగా తమ కుటుంబ సభ్యులను చంపుతామని బెదిరిస్తున్నారన్నారు. వారి నుండి తమకు ప్రాణహాని లేకుండా రక్షణ కల్పించాలని వారు కోరారు. డబ్బులు తిరిగి ఇప్పించాలని విజ్ఞప్తి చేశారు.

గుండ్లకమ్మ భద్రమేనా!


- తుంగభద్ర డ్యాం ఘటనతో ప్రాజెక్టుపై మరింత టెన్షన్
- వైసీపీ పాలకుల నిర్లక్ష్యంతో గతంలో
- రెండు సార్లు కొట్టుకుపోయిన గేట్లు
- వరుసగా రెండేళ్ల పాటు ఆయకట్టుకు అందని నీరు
- ఇప్పటికీ ప్రమాదకరంగానే సగం గేట్లు
- నీరు అందుబాటులో ఉన్నా నిల్వ చేయలేని దుస్థితి
- ఒక టీఎంసీకే పరిమితం చేస్తున్న అధికారులు
- వాస్తవ సామర్థ్యం 3.85 టీఎంసీలు
- పాలక పెద్దలు దృష్టిపెడితే రబీకి నీరు

ఐదేళ్ల వైసీపీ పాలనలో రాష్ట్రంలో సాగునీటి ప్రాజెక్టుల నిర్వహణపై చూపిన నిర్లక్ష్యం జిల్లాలోని గుండ్లకమ్మ ప్రాజెక్టును నేటికీ వెంటాడుతోంది. వర్షాలతో కాకపోయినా కృష్ణానది పొంగిపొర్లుతూ సాగర్ కాలువలకు సీజన్ కంటే ముందుగానే నీరు వస్తోంది. ఆ నీటితో ప్రాజెక్టును నింపుకొనే అవకాశం ఉన్నా గేట్లు ప్రమాదకరంగానే ఉండటంతో అధికారులు ధైర్యం చేయడం లేదు. తాజాగా తుంగభద్ర డ్యాం గేట్లు కొట్టుకుపోయిన ఘటనతో గుండ్లకమ్మ భద్రతపై యంత్రాంగం ఆందోళన చెందుతోంది. ఇంచుమించు సగం గేట్లు మరమ్మతులు లేదా కొత్తవి పెట్టాల్సి ఉంది. మిగతా వాటిలో కొన్నింటి పనులు జరుగుతున్న తరుణంలో కనీసం రెండు టీఎంసీల నీటిని అయినా నిల్వ చేద్దామన్న ఆలోచనతో ఉన్న అధికారులు తుంగభద్ర ఘటనతో వెనక్కితగ్గారు. ప్రాజెక్టులో మొత్తం 3.859 టీఎంసీల నిల్వ సామర్థ్యం ఉంది. ప్రస్తుతం ఒక టీఎంసీ చేరగానే ఇక అంతకు మించి నిల్వ చేయడం మంచిది కాదన్న అభిప్రాయంతో ఎగువ నుంచి నీరు రాకుండా ఆపేస్తున్నారు.

ఒంగోలు, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : ప్రాజెక్టు నిర్వహణలో వైసీపీ ప్రభుత్వ అసమర్థతతో గుండ్లకమ్మ ప్రాజెక్టులో వరుసగా రెండేళ్లు రెండు గేట్లు కొట్టుకుపోయాయి. తక్షణం మరమ్మతులలోనూ చేసిన జాప్యంతో గత రెండేళ్లుగా ఆయకట్టుకు నీరు ఇవ్వలేదు. ఆలస్యంగా గేట్ల మరమ్మతు పనులు చేపట్టినా సకాలంలో నిధులు ఇవ్వకపోవడంతో ఇప్పటికి కూడా పనులు పూర్తికాలేదు. ప్రస్తుతం నీరు అందుబాటులో ఉన్నా నిల్వ చేసుకునే అవకాశం లేకుండాపోయింది. మొత్తం 15గేట్లు గుండ్లకమ్మ ప్రాజెక్టు పరిధిలో 80,060 ఎకరాల ఆయకట్టు ఉండగా ఒంగోలుతోపాటు దాదాపు 70కిపైగా గ్రామాలకు తాగునీరు అందనుంది. గత టీడీపీ పాలనలో ప్రాజెక్టు నిర్వహణ బాగానే ఉన్నా వైసీపీ ప్రభుత్వం వచ్చాక గాలికి వదిలేశారు. గేట్ల నిర్వహణ సరిలేక దెబ్బతిని పోగా రెండు గేట్లకు మరమ్మతులు అత్యవసరమని అందుకు రూ.90లక్షలు ఇవ్వాలని యంత్రాంగం కోరినా పట్టించుకోలేదు. ఫలితంగా 2022 ఆగస్టు 31న మూడవ నెంబరు గేటు కొట్టుకుపోయింది. అప్పటికి మేల్కొని అధికారులు మరమ్మతులు కోరిన 6, 7 గేట్లకు నిధులు ఇవ్వగా పనులు చేశారు.

బిల్లుల పెండింగ్‌తో..

అయితే సదరు కాంట్రాక్టర్లకు రూ.60లక్షల బిల్లులు పెండింగ్ పెట్టడంతో కొట్టుకుపోయిన మూడవ నెంబరు గేటు పని ఇస్తామన్న వద్దని వెళ్లిపోయారు. ఈక్రమంలో 2023 డిసెంబరులో రెండవ నెంబరు గేటు కొట్టుకుపోయింది. దాంతో వరుసగా రెండేళ్ల ప్రాజెక్టులో నీరు నిల్వ చేసే అవకాశం లేక ఆయకట్టుకు నీరు ఇవ్వక రైతులు రూ.500 కోట్లకుపైగా ఉత్పత్తులు నష్టపోయారు. ఆ విషయం అలా ఉంచితే వరుసగా రెండవ ఏడాది కూడా గేటు కొట్టుకుపోయిన నేపథ్యంలో మొత్తం గేట్ల మరమ్మతులు లేదా కొత్తవి పెట్టడం అవసరంగా చేసిన నిపుణుల కమిటీ సూచనకు మోక్షం లభించింది. అప్పటికే చేసిన 6,7 గేట్లు అలాగే పెండింగ్‌లో ఉన్న మూడవ గేటు మినహా మిగిలిన 12 గేట్లకు రూ.9.60 కోట్లు టెండర్ పిలిచారు. అహ్మదాబాద్‌కు చెందిన కంపెనీ టెండర్ పొంది వేగంగా పనులు చేపట్టింది. ఇప్పటి వరకు దాదాపు రూ.5 కోట్ల విలువైన పనులు చేశారు. టెండర్‌లో 12 గేట్లలో ఐదింటిని పూర్తిగా అమర్చగా రెండింటిని అమర్చుతున్నారు. మరొకటి ఈ వారంలో రానుంది. అయితే వారికి కూడా బిల్లులు చెల్లించకపోవడంతో తదుపరి గేట్లు పనులు ముందుకు సాగడం లేదు.



గేట్లు కొట్టుకుపోవడంతో గుండ్లకమ్మ నుంచి వృథాగా పోతున్న నీరు(ఫైల్)

నిధులు ఇవ్వకపోవడంతో ఆలస్యం

ఇదిలా ఉండగా మొత్తం 15 గేట్లలో గతంలో పెట్టిన 6, 7 గేట్లతోపాటు మరో ఐదు పూర్తిగా అమర్చగా మరో ఐదు కొత్తవి పెట్టాల్సి ఉంది. మిగిలిన పనులు జరుగుతున్నారు. అయితే గత వైసీపీ ప్రభుత్వం నిధులు ఇచ్చి ఉంటే మిగిలిన పనులు కూడా జరిగేవి. పట్టించుకోకపోవడంతో ఇంకా సగం గేట్లు ప్రమాదకరంగానే ఉన్నాయి. దీంతో ప్రాజెక్టులోకి నీటిని పెట్టే అవకాశం ఉన్నా గేట్ల భద్రతపై అనుమానంతో అధికారులు ధైర్యం చేయలేక పోతున్నారు. గుండ్లకమ్మ నీటిమట్టం 24.38 మీటర్లు, నిల్వ సామర్థ్యం 3.85 టీఎంసీలు. కాగా ప్రస్తుతం 20.40 మీటర్ల నీటిమట్టంతో ఒక టీఎంసీ నీరు నిల్వ ఉంది. అందులో గేట్ల పనులతో నీటిని వదిలివేశాక 0.4 టీఎంసీలు ఉండగా కొత్తగా 0.6 టీఎంసీలు పెట్టారు. నిజానికి ప్రస్తుతం గేట్లు బాగా ఉండి ఉంటే ప్రాజెక్టును పూర్తిస్థాయిలో నీరు నింపుకోవచ్చు. కృష్ణానదికి వరద పోటెత్తి శ్రీశైలం, సాగర్ డ్యామ్‌లు నిండి నీరు సముద్రం పాలవుతున్న నేపథ్యంలో సాగర్ కుడి కాలువకు నీరిచ్చిన ప్రభుత్వం ఆ నీటితో వనరులను నింపుకోవాలని ఆదేశించింది. తదనుగుణంగా సాగర్ కాలువ జిల్లా సరిహద్దు 85/3 వద్ద ఉన్న ఎస్కేప్ నుంచి వారం క్రితం గుండ్లకమ్మకు నీరు వదిలారు. ఇప్పటికి అలా అక్కడి నుంచి నీరు తీసుకొని పూర్తిగా ప్రాజెక్టును నింపుకొనే అవకాశం ఉంది. అయితే ప్రాజెక్టు నిల్వ ఒక టీఎంసీకి చేరేసరికి ఎగువ నుంచి నీటిని ఆపేశారు.

పనులు పూర్తికాకనే..

వాస్తవానికి ఐదు గేట్లు పూర్తితోపాటు మరో మూడింటి వద్ద పనులు జరుగుతున్నాయి. వాటి వద్ద స్టాప్‌లాక్ గేట్లు అమర్చడం, మరో మూడు వద్ద ఒకస్థాయి వరకు స్టాప్‌లాక్ గేట్లు పెట్టి ఉండటంతో మరొక టీఎంసీ నీటిని నిల్వ చేసే అవకాశం ఉంటుంది. అయితే తాజాగా జరిగిన తుంగభద్ర ఘటనతో గుండ్లకమ్మ అధికారులు ఒక టీఎంసీ మించి నిల్వ చేసేందుకు ధైర్యం చేయడం లేదు. ప్రస్తుతం ప్రాజెక్టులోకి 1,200 క్యూసెక్కుల నీరు వస్తుంది. దిగువన నీటి అవసరాల కోసం 600 క్యూసెక్కులు నాలుగు రోజులు ఇచ్చారు. ఎగువన ఒకటి, రెండు రోజులలో ఆగిపోనుండటంతో దిగువకు విడుదల కూడా ఆపేశారు. ఎడమ కాలువకు 50 క్యూసెక్కులు ఇస్తున్నారు. మొత్తంగా ఒక టీఎంసీ మించి నిల్వ చేయలేని పరిస్థితి నెలకొంది. ఇదిలాఉండగా కాంట్రాక్టు కంపెనీ వేగంగా పనులు చేపట్టడంతో నాలుగైదు నెలల్లోనూ ఐదు గేట్లను పూర్తిగా అమర్చింది. మరో మూడు గేట్లను ఈ నెలాఖరుకు పూర్తయ్యే అవకాశం ఉంది. ఈ తరుణంలో ప్రస్తుత ప్రభుత్వం సదరు కంపెనీకి చేసిన పనులకు బిల్లులు ఇస్తే కనీసం అక్టోబరు నాటికి అయినా గేట్లు పూర్తిచేసి పూర్తిస్థాయిలో నీటిని నిల్వచేసి ఆయకట్టుకు నీరు ఇవ్వవచ్చు. ఆ వైపుగా పాలకపక్ష పెద్దలు తక్షణం దృష్టిపెట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది. కాకపోతే ఈ ఏడాది కూడా ఆయకట్టు రైతులు ఇక్కట్లు పడక తప్పదు.

సర్దుబాటు వాయిదా!

15 వరకు టీచర్ల వినతులు స్వీకరణ

16న కొత్త సీనియార్టీ జాబితాలు.. 17న కౌన్సెలింగ్

ఒంగోలు(విద్య), ఆగస్టు 12 : ఉపాధ్యాయుల సర్దుబాటు వాయిదా పడింది. ఉపాధ్యాయ సంఘాల తిరుగుబాటుతో విద్యాశాఖ నష్టనివారణ చర్యల్లో భాగంగా ప్రక్రియను వాయిదా వేసింది. టీచర్ల సర్దుబాటుకు సంబంధించి మొదట ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం సోమవారం ఉదయానికి మండల విద్యాధికారుల లాగిన్‌లో ఆ మండలంలోని మిగులు టీచర్లు, కొరత ఉన్న పాఠశాలలు దర్శనమిచ్చాయి. ఆ జాబితాలు చూసిన టీచర్లకు అయోమయానికి గురయ్యారు. టీచర్ల సర్దుబాటుకు సంబంధించి ఒక్కటే చర్చ.. సీనియార్టీ విషయం తప్ప మరే ప్రతిపాదనను విద్యాశాఖ పరిగణనలోకి తీసుకోలేదు. టీచర్ల సర్దుబాటు ప్రక్రియ యథాతధంగా జరిగితే ప్రభుత్వ పాఠశాలల మనుగడకే ముప్పు వస్తుందని భావించారు. వెంటనే ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య(ఫ్యాప్టో) రంగంలోకి దిగింది. ఇతర సంఘాల నాయకులు కూడా కదిలారు. తమతో చర్చలు జరపకుండా, తమ సూచనలను పరిగణనలోకి తీసుకోకుండా సర్దుబాటును తాము అంగీకరించబోమని తేల్చిచెప్పారు. సోమవారం మూడు గంటలకు మండలాల్లో జరగాల్సిన సర్దుబాటు కౌన్సెలింగ్‌ను బహిష్కరిస్తున్నట్లు ప్రకటించారు. ఈ మేరకు ఎంఈఓలకు కౌన్సెలింగ్‌ను బహిష్కరిస్తున్నట్లు నోటీసులు ఇచ్చారు. దీంతో కౌన్సెలింగ్ వాయిదాపడింది జీవో నెంబరు 117ను తాము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నా దాని ప్రకారం సర్దుబాటుకు సంబంధించి మిగులు టీచర్లు, కొరత ఉన్న పాఠశాలలను గుర్తించడమేమిటని వారు ప్రశ్నిస్తున్నారు. ఈ నేపథ్యంలో క్షేత్రస్థాయి నుంచి టీచర్ల అభిప్రాయాలను తెలుసుకోవాలని విద్యాశాఖ నిర్ణయించింది. దీని కోసం తాజా షెడ్యూల్‌ను ప్రకటించింది. ఈనెల 15 వరకు టీచర్ల నుంచి అభిప్రాయ సేకరణ చేయనుంది. ఇప్పటికే విడుదల చేసిన మిగులు టీచర్ల సీనియార్టీ జాబితాలపై అభ్యంతరాలు ఉంటే తెలియజేయమంది. 15వతేదీ వరకు వచ్చిన సూచనలను పరిశీలించి 16న టీచర్ల సీనియార్టీ తుది జాబితాను ప్రకటించి 17న మండల స్థాయిలో సర్దుబాటు కౌన్సెలింగ్ నిర్వహిస్తారు. సోమవారం విడుదలైన జాబితా ప్రకారం ఒంగోలు మండలంలో 51మంది సర్‌ప్లస్‌గా తేలారు. అయితే వారిలో 36 మందిని సర్దుబాటు చేయవచ్చు. దీంతో నికరంగా 15 మంది టీచర్లు మిగులుగా తేలారు. సంతనూతలపాడు మండలంలో 38మంది మిగులుగా తేలగా ఆరుగురు మాత్రమే సర్దుబాటు చేయవచ్చు. దీంతో నికరంగా 32మంది టీచర్లు మిగులుగా తేలారు.

టీచర్ల సర్దుబాటు బహిష్కరణ

అసంబద్ధమైన, అశాస్త్రీయమైన ఉపాధ్యాయుల సర్దుబాటును ఫ్యాప్టో, ఏపీటీఎఫ్ రాష్ట్ర శాఖల పిలుపు మేరకు బహిష్కరిస్తున్నట్లు ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వాకా జనార్దన్‌రెడ్డి, డి శ్రీనివాసులులు ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. ఉపాధ్యాయ సంఘాలు చెప్పిన ఏ అంశాన్ని పరిగణనలోకి తీసుకోకుండా ప్రభుత్వం ఏకపక్షంగా సర్దుబాటు ప్రక్రియను చేపట్టి ఆగమేఘాల మీద కౌన్సెలింగ్ చేపట్టడాన్ని వారు తప్పుబట్టారు. 117 జీవో వల్ల వేలాదిమంది విద్యార్థులు పాఠశాలలను వదిలి డ్రాపవుట్లుగా మిగులుతున్నారని, అందువల్ల ఆ జీవోను రద్దుచేయాలని డిమాండ్ చేశారు.

అక్రమంగా మట్టి తరలిస్తున్న టిప్పర్లు, ఎక్స్‌కవేటర్లు పట్టివేత

ఇంకా చెలరేగిపోతున్న వైసీపీ ముఠా

ఇప్పటికి రెండుస్లార్లు పట్టుకున్నా వెరవని వైనం



అక్రమంగా మట్టి తరలిస్తూ పట్టుబడిన టిప్పర్లు, ఎక్స్‌కవేటర్లు

దర్శి, ఆగస్టు 12: మండలంలోని రాజంపల్లి చెరువులో మట్టిని అక్రమంగా తరలి స్తున్న టిప్పర్లు, ఎక్స్‌కవేటర్లను సోమవారం రెవెన్యూ అధికారులు పట్టుకున్నారు. ప ట్టపగలు చెరువులో మట్టి అక్రమంగా తరలిస్తున్న సమాచారం అందటంతో తహసీ ల్దార్ ఎం.శ్రావణ్‌కుమార్ హుటాహుటీన వెళ్లారు. చెరువులో నాలుగు ఎక్స్‌కవేటర్లతో టిప్పర్లకు మట్టి ఎత్తుతుండగా పట్టుకున్నారు. అక్కడ ఉన్న నాలుగు ఎక్స్‌కవేటర్లు, రెండు టిప్పర్లను పట్టుకొని దర్శికి తరలించారు. ప్రభుత్వం మారినప్పటికీ వైసీపీ నాయకుల మట్టి దందా ఆగలేదు. అధికారుల మెతక వైఖరితో దొంగచాటుగా మట్టి తరలిస్తూనే ఉన్నారు. ఇటీవలకాలంలో రెండు సార్లు రాజంపల్లి చెరువులో మట్టి తరలిస్తూ పట్టుబడినప్పటికీ మళ్లీ సోమవారం అక్రమంగా మట్టి తరలిస్తున్నారు. కొద్దిరోజుల క్రితం నూతన తహసీల్దార్‌గా బాధ్యత లు చేపట్టిన శ్రావణ్‌కుమార్ సమాచారం అందిన వెంటనే వెళ్లి మట్టి తరలింపును అడ్డుకున్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎక్కడైనా ప్రభుత్వ భూముల్లో, కొండల మట్టి తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మట్టి తర లించే టిప్పర్లు, ఎక్స్‌కవేటర్లను సీజ్ చేస్తామని చెప్పారు.

కదిలి వచ్చిన కలెక్టర్

'మీ కోసం' వేదిక నుంచి దిగి వచ్చిన అన్సారియా

దివ్యాంగుడి సమస్య విని వెంటనే స్పందన

అర్హత ఉంటే పింఛన్ పెంచాలని ఆదేశాలు



దివ్యాంగుడు రామకృష్ణతో మాట్లాడుతున్న కలెక్టర్ అన్సారియా

ఒంగోలు(కలెక్టరేట్), ఆగస్టు 12 : కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన మీ కోసం కార్యక్రమంలో కలెక్టర్ తమీమ్ అన్సారియా తన హోదాను పక్కన పెట్టి సమస్యను చెప్పుకునేందుకు వచ్చిన దివ్యాంగుడు సమస్యలను తెలుసుకునేందుకు వేదిక దిగి కిందకు వచ్చారు. ఆమె కిందకు రావడమే కాకుండా అక్కడే కింద కూర్చొని ఆ దివ్యాంగుడి సమస్యను అడిగి తెలుసున్నారు. ఒంగోలు మండలం ఉలిచి గ్రామానికి చెందిన మేడా రామకృష్ణ మీ కోసం కార్యక్రమంలో తన సమస్యను చెప్పుకునేందుకు లోపలికి వచ్చాడు. చేనేత కుటుంబానికి చెందిన రామకృష్ణకు 90శాతం వికలత్వం ఉండటంతో ఏమి పనిచేయలేని స్థితిలో ఉన్నారు. ప్రస్తుతం దివ్యాంగుల కోటా కింద నెలకు రూ.6వేలు పెన్షన్ తీసుకుంటున్నారు అయితే పూర్తి స్థాయిలో వికలాంగత్వం ఉన్నందున తనకు నెలకు రూ.15వేలు పెన్షన్ కోసం కలెక్టర్ తమీమ్ అన్సారియాకు వినతిపత్రం ఇచ్చేందుకు వచ్చారు. నేలపై కూర్చుని ఉన్న అతనిని చూసిన కలెక్టర్ వేదిక దిగి వచ్చి అతనితో మాట్లాడారు. నిబంధనల ప్రకారం అర్హత ఉంటే తప్పనిసరిగా పింఛన్‌ను పెంచే విధంగా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు వెంటనే సంబంధిత అధికారులకు ఆ అర్జీని పరిశీలించాలని కలెక్టర్ ఆదేశించారు. కాగా కలెక్టర్ వేదికపై నుంచి కిందకు వచ్చి ఒక దివ్యాంగుడి వద్ద సమస్యను తెలుసుకునే విధానంపై అధికారులతోపాటు అర్జీలు ఇచ్చేందుకు వచ్చిన ప్రజానీకం ఆమె ఔదార్యం, సహృదయతపై చర్చించుకోవడం కనిపించింది.

లారీ డ్రైవర్ మృతిపై కేసు నమోదు

కనిగిరి, ఆగస్టు 12: గ్రానైట్ క్వారీలో పనిచేస్తున్న లారీ డ్రైవర్ అట్లూరి రత్తయ్య(41) అనుమానాస్పద మృతిపై సోమవారం కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ త్యాగరాజు తెలిపారు. గార్లపేట రోడ్డులోగల దస్తగిరి గ్రానైట్ క్వారీలో ఈ ప్రమాదం జరిగిందని ఆయన తెలిపారు. గ్రానైట్ రాయిని క్వారీ ర్యాంపు నుంచి లారీలోకి లోడ్‌చేసే క్రమంలో ప్రమాదం చోటుచేసుకుంది. బండరాయి ఒక్కసారిగా ఒరిగిపోయి లారీకి, క్వారీ ర్యాంప్‌నకు మధ్యలో లారీ డ్రైవర్ రత్తయ్యపై పడింది. ప్రమాదంలో రత్తయ్య తలకు బలమైన గాయంకాగా స్థానిక ప్రయివేటు ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. మృతుడి కుమారుడు అట్లూరి రమేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

కనువిందు చేస్తున్న భైరవకోన జలపాతం



సీఎస్‌పురం(పామూరు), ఆగస్టు 12: సీఎస్‌పురం మండలంలోని భైరవకోన జలపాతం నీటి ఉధృతితో సోమవారం కళకళలాడుతుంది. సాయంత్రం కురిసిన వర్షానికి జలపాతంలోకి నీళ్ళు పుష్కలంగా చేరాయి. కొండ కోనల నడుమ నుంచి జాలువారుతున్న నీటిలో స్నానాలు ఆచరిస్తే సకల పాపాలు హరిస్తాయనేది భక్తుల విశ్వాసం. జలపాతం అందాలు తిలకించేందుకు పర్యాటకులు మంగళవారం నుంచి వచ్చే అవకాశం ఉన్నందున జలపాతం వద్ద ప్రమాదాలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నట్లు దేవస్థాన కమిటీ సభ్యులు తెలిపారు. పామూరు, సీఎస్‌పురం మండలాల్లో ఓ మోస్తారు వర్షం కురిసింది.



డాక్టర్ ఎం.మహేంద్రనాథ్

టీడీపీ నియోజకవర్గ అధికార ప్రతినిధిగా డాక్టర్ మహేంద్రనాథ్

చీరాల, ఆగస్టు 12 : టీడీపీ చీరాల నియోజకవర్గ అధికార ప్రతినిధిగా డాక్టర్ ఎం.మహేంద్రనాథ్‌ను ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య నియమించారు. ఈ మేరకు పార్టీ అధిష్ఠానానికి లేఖ పంపారు. సోమవారం అధిష్ఠాన ఆమోదం లభించింది. నియోజకవర్గ అధికార ప్రతినిధిగా నియమితులైన మహేంద్రనాథ్ మాట్లాడుతూ పార్టీ బలోపేతమే లక్ష్యంగా పనిచేస్తానన్నారు. దాంతో పాటు నియోజకవర్గ ప్రజల సమస్యలపై తనకు పూర్తి అవగాహన ఉందన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా నియోజకవర్గంలో ప్రతి ఒక్కరినీ తాను ప్రత్యక్షంగా కలిసినట్లు చెప్పారు. నియోజకవర్గ అభివృద్ధి, ప్రజల సంక్షేమం రెండు కళ్లుగా కూటమి శ్రేణులను కలుపుకుని ముందుకు సాగుతామన్నారు. తనను అధికార ప్రతినిధిగా నియమించిన ఎమ్మెల్యే కొండయ్యకు కృతజ్ఞతలు తెలిపారు. కూటమి శ్రేణులు మహేంద్రనాథ్‌కు అభినందనలు తెలిపారు.

ఆక్రమణలు తొలగించేనా?

- భవనాసిని రిజర్వాయర్‌గా మార్చే క్రమంలో అడ్డంకిగా సమస్య
- అధికారుల ఉదాసీనతతో పెరుగుతున్న చేపల చెరువులు



భవనాసి చెరువు

భవనాసి అంచున ఉన్న చేపల చెరువులు

అద్దంకి, ఆగస్టు 12 : భవనాసి చెరువులో ఉన్న ఆక్రమణలు తొలగింపుపై అధికారుల ఉదాసీనత భవిష్యత్‌లో మరిన్ని సమస్యలకు కారణంగా నిలిచే అవకాశం ఉంది. భవనాసి చెరువును రిజర్వాయర్‌గా మార్చే పనులు 2009 సంవత్సరంలో ప్రారంభమయ్యాయి. అప్పట్లోనే రిజర్వాయర్ నిర్మాణానికి సంబంధించి సర్వే చేపట్టి హద్దు రాళ్లు వేశారు. అప్పటికే కొంత మేర భవనాసి చెరువు ఆక్రమణకు గురైనట్లు గుర్తించారు. 1918 సంవత్సరంలో భవనాసి చెరువు నిర్మాణం పూర్తయింది. అప్పట్లో భవనాసి చెరువు విస్తీర్ణం వెయ్యి ఎకరాలు ఉంటుందని అంచనా. ప్రస్తుతం చెరువు విస్తీర్ణం ఏడెనిమిది వందల ఎకరాలకు మించి ఉండదనే అభిప్రాయం వ్యక్తం అవుతుంది. కొంత భాగాన్ని రైతులు ఆక్రమించి సాగు భూములుగా మార్చుకోగా, క్రమేపి ఆ భూమి లో చేపల చెరువుల ఏర్పాటు జరుగుతూ వస్తుంది. భవనాసి చెరువు అంచున పెద్ద ఎత్తున చేపల చెరువులు ఏర్పాటు ఏటికేడు పెరుగుతునే ఉన్నాయి. పనిలో పనిగా కొత్త చేపల చెరువులు తవ్వకాలు సమయంలో భవనాసి చెరువులో కొంత భాగాన్ని ఆక్రమిస్తున్నారు. ఆక్రమణలు జరుగుతున్నా ఆయా శాఖల అధికారులు మొక్కుబడిగా హడావుడి చేయడం మినహా అడ్డుకోకపోవడంతో ఆక్రమణదారులు మరింత రెచ్చిపోతున్నారు. దీంతో భవనాసి చెరువుకు రెండు వైపులా ప్రస్తుతం చేపల చెరువులు పెద్ద ఎత్తున ఏర్పడ్డాయి. రిజర్వాయర్ పనులు పూర్తయితే చేపల చెరువులు తొలగించకుండా నీటి నిల్వ సామర్థ్యం పెంచటం సాధ్యం కాదు. చేపల చెరువులను తొలగించాలంటే పెద్ద మొత్తంలో పరిహారం ఎలాగూ పొందవచ్చు అన్న ధీమాతో పెద్ద మొత్తంలో చేపల చెరువులు తవ్వకాలకు జరుగుతున్నట్లు తెలుస్తుంది. ఈ నేపథ్యంలో ముందస్తుగానే అధికారులు ఆక్రమణలు తొలగించాలని పలువురు కోరుతున్నారు. అలా కాకుండా రిజర్వాయర్ నిర్మాణం పూర్తయిన తరువాత అయితే ఆక్రమణల తొలగింపునకు మరికొంత కాలం సమయం పట్టి కాలయాపన జరిగే అవకాశం ఉంటుందని పలువురు సూచిస్తున్నారు. ఇప్పటికైనా భవనాసి చెరువును ఆక్రమించి ఏర్పాటు చేసిన చేపల చెరువులను, అనుమతులు లేకుండా తవ్విన చేపల చెరువులను తొలగిస్తారో లేక తమ కెందుకులే అని గతంలో పనిచేసిన అధికారుల వలే మిన్నకుంటారో వేచి చూడాల్సి ఉంది.



ఇసుక రీచ్‌ను పరిశీలిస్తున్న చీరాల ఆర్డీవో సూర్యనారాయణరెడ్డి

ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయండి

అధికారులకు ఆర్డీవో ఆదేశం

చినగంజాం, ఆగస్టు 12 : అనుమతులు లేకుండా ఇసుక అక్రమంగా రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని చీరాల ఆర్డీవో సూర్యనారాయణ రెడ్డి హెచ్చరించారు. మండలంలోని కడవకుదురు, మోటుపల్లి ప్రాంతాల్లోని ఇసుక తవ్విన ప్రదేశాలను సోమవారం ఆయన పరిశీలించారు. ఇసుక అక్రమ రవణా అడ్డుకట్టకు చర్యలు తీసుకోవాలని ఆర్డీవో రెవెన్యూ సిబ్బందిని ఆదేశించారు. అనుమతులు లేకుండా ఎవరైనా అక్రమంగా ఇసుక తరలిస్తే ఆ వాహనాలు, ఎక్స్‌కవేటర్‌ను సీజ్ చేసి, యజమానులపై కేసు నమోదు చేయాలన్నారు. మోటుపల్లి ప్రాంతంలోని ఇసుక క్వారీలోకి వాహనాలు వెళ్లకుండా అడ్డుగా ముళ్ల కంచ వేయించారు. కార్యక్రమంలో తహసీల్దార్ జి.ప్రభాకరరావు, వీఆర్వోలు పి.నాగరాజురెడ్డి, బండారు దానియేలు పాల్గొన్నారు.

గోమాతల గ్రాసానికి విరాళం

ఆంధ్రజ్యోతి కథనానికి స్పందన



గోశాల నిర్వాహకుడికి సాయం అందిస్తున్న అరుణ కృష్ణమహర్షి

అద్దంకి, ఆగస్టు 12 : పట్టణంలో నిర్వహిస్తున్న హరిహర గోశాలలో ఆవుల ఆకలి తీర్చేందుకు పలువురు దాతలు ముందుకు వచ్చినట్లు గోశాల నిర్వాహకుడు గోనుగుంట సుబ్బారావు తెలిపారు. ఆంధ్రజ్యోతిలో సోమవారం ప్రచురితమైన గోమాతల ఆక్రందన కథనంపై పలువురు దాతలు స్పందించారు. చీరాలకు చెందిన ఆధ్యాత్మిక గురువు గద్దె అరుణ కృష్ణమహర్షి సోమవారం గోశాలను పరిశీలించి చలించిపోయారు. ఆవులకు గ్రాసం కొరత విషయాన్ని ఆంధ్రజ్యోతిలో వచ్చిన కథనంద్వారా తెలుసుకొని తనకు తిండి కూడా తినబుద్ధి కాలేదని, తనవంతుగా రూ.10వేల నగదును అందజేశారు. తనకు పరిచయం ఉన్న పలువురు ద్వారా ఆర్థిక సాయం సమకూర్చేందుకు కృషి చేస్తానని కృష్ణమహర్షి తెలిపారు. అద్దంకి పట్టణంలోని నాగసూరి సత్యనారాయణ సుమారు రూ.15వేల విలువైన తౌడును అందజేశారు. మరికొందరు దాతలు కూడా తమ వంతు సహకారం అందించేందుకు ముందుకు వచ్చినట్లు నిర్వాహకుడు సుబ్బారావు తెలిపారు.

గిరిజన గురుకులానికి మైక్‌సెట్ అందజేత



మైకొసెట్‌ను అందజేస్తున్న రోటరీ సభ్యులు

అద్దంకిటౌన్, ఆగస్టు 12 : రోటరీ క్లబ్ ఆఫ్ శింగరకొండ ఆధ్వర్యంలో అద్దంకి పట్టణంలోని గిరిజన గురుకుల పాఠశాలకు మైక్ సెట్‌ను అందజేశారు. ఈ సందర్భంగా కురిచేటి వెంకట సుబ్బారావు (చిన్ని) సౌజన్యంతో భార్య అలేఖ్య జ్ఞాపకార్థం పట్టణంలోని ఎస్‌బీఐ కాలనీ రోడ్డులో ఉన్న గిరిజన గురుకుల పాఠశాలకు మైక్ సెట్‌ను అందించినట్లు క్లబ్ అధ్యక్షుడు చప్పిడి వీరయ్య తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ పురుషోత్తం, రోటరీ కార్యదర్శి చుండూరి మురళి సుధాకరరావు, చిన్ని మురళీకృష్ణ, శ్రీరామచంద్రమూర్తి, హరి ప్రసాద్, రామకోటేశ్వరరావు, సుబ్బారావు, శ్రీనివాసరావు, కొల్లా భువనేశ్వరి పాల్గొన్నారు.

వ్యక్తిపై కత్తితో పలువురు దాడి

ఈపూరుపాలెం(చీరాలటౌన్), ఆగస్టు 12 : ద్విచక్ర వాహనాన్ని ఆపి వ్యక్తిపై పలువురు కత్తితో దాడిచేసి గాయపరిచిన సంఘటన ఆదివారం రాత్రి చీరాల మండలం ఈపూరుపాలెం యూసూఫ్‌నగర్ రైలు గేటు వద్ద చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బాపట్ల మండలం స్టూవర్టుపురానికి చెందిన దేవరకొండ కిషోర్, మరియమ్మ ద్విచక్ర వాహనంపై చీరాల నుంచి యూసూఫ్‌నగర్ మీదుగా ఇంటికి వెళుతున్నారు. బోయినవారిపాలెంకు చెందిన కోటి మోహన్, మరో ఇద్దరు వీరిని అడ్డగించి కత్తితో దాడిచేసి గాయపరిచారు. అడ్డు వచ్చిన మరియమ్మపై కూడా దాడిచేశారు. బాధితులు చీరాల ఏరియా వైద్యశాలలో చికిత్స పొందుతున్నారు. ఘటనపై ఈపూరుపాలెం పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు.

బైకిస్టులకు గాయాలు

మార్టూరు, ఆగస్టు 12 : ముందు వెళుతున్న ద్విచక్రవాహనాన్ని వెనుక వైపు నుంచి వస్తున్న బైకు ఢీకొన్న ఘటన సోమవారం జరిగింది. ఈ ప్రమాదంలో ముందు బైక్‌పై వెళ్తున్న కే వీరబ్రహ్మ, అతని తండ్రి హనుమంతరావుకు గాయాలయ్యాయి. వారు జె.పంగులూరు మండలం కోటపాడు గ్రామానికి చెందిన వారు. వారిని 108లో ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఢీకొట్టిన ద్విచక్రవాహనదారుడికీ గాయాలుకాగా అతని స్నేహితులు ఆసుపత్రికి తరలించారు.

వడ్డీ వ్యాపారి వేధింపులతో ఆత్మహత్యాయత్నం

చీరాలటౌన్, ఆగస్టు 12 : వడ్డీ వ్యాపారి వేధింపులు తాళలేక వ్యక్తి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. ఈఘటన సోమవారం మధ్యాహ్నం పట్టణ పరిధిలోని థామస్‌పేటలో చోటుచేసుకుంది. బాధిత కుటుంబ సభ్యుల వివరాల మేరకు పేటకు చెందిన గొల్ల సాల్మన్ రోజువారి కూలీ. ఇతనికి భార్య, ఇద్దరు కుమార్తెలున్నారు. కుటుంబ అవసరాల నిమిత్తం అదే ప్రాంతానికి చెందిన బడుగు హెప్సిబా వద్ద అధిక వడ్డీకు సుమారు రూ.1.50లక్షలు వరకు అప్పు తీసుకున్నారు. ఇందుకు సంబంధించి ఇప్పటికే చాలా వడ్డీ చెల్లించారు. రోజుకు రూ.వెయ్యి చెల్లించాలని లేదా ఉన్న పళంగా బాకీ ఇవ్వాలని, లేకుంటే ఇంటికి తాళాలు వేస్తానని హెప్సిబా బెదిరింపులకు పాల్పడ్డారు. ఈ విషయమై రెండు రోజులుగా పంచాయితీ జరుగుతుంది. గడువుకు సోమవారం చివరి రోజు కావడంతో చేసేదిలేక సాల్మన్ పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. గ్రహించిన చిన్న కుమార్తె ఏంజిల్ బిగ్గరగా కేకలు వేయడంతో కుటుంబ సభ్యులు చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం గుంటూరుకు తరలించారు. ఈమేరకు అవుట్ పోస్ట్ పోలీసులు వివరాలు నమోదు చేసుకున్నారు. అయితే దీనిపై బాధితుడి సోదరి దయమ్మ మాట్లాడుతూ హెప్సిబా వేధింపులకు గతంలోనే చిన్న తమ్ముడు సామ్యేల్ రైలు కిందపడి మృతిచెందినట్లు ఆరోపించారు. బాపట్లకు చెందిన తులసి అనే వ్యక్తిని తీసుకువచ్చి బెదిరింపులకు పాల్పడుతున్నట్లు ఆరోపించారు. ఇప్పుడు ఇంకో తమ్ముడిని వేధిస్తున్నట్లు ఆవేదన వ్యక్తం చేశారు. పోలీసులు చర్యలు తీసుకోవాలని కోరారు.

ఎంపీడీవోగా రామాంజనేయులు

పంగులూరు, ఆగస్టు 12 : జె.పంగులూరు ఎంపీడీవోగా బి.రామాంజనేయులు నియమితులయ్యారు. సార్వత్రిక ఎన్నికల సందర్భంగా నెల్లూరు జిల్లాకు బదిలీపై వెళ్లిన బి.రామాంజనేయులును తిరిగి జె.పంగులూరుకు నియమిస్తూ సోమవారం ఉత్తర్వులు వచ్చినట్లు ఇన్‌చార్జి ఎంపీడీవో రమేష్ బాబు తెలిపారు.



అర్జీలను స్వీకరిస్తున్న తహసీల్దార్ పార్వతి

సమస్యలను ప్రాధాన్యతాక్రమంలో పరిష్కరిస్తాం

తహసీల్దార్ పార్వతి

వేటపాలెం(చీరాల), ఆగస్టు 12 : ప్రజల సమస్యలను ప్రాధాన్యతా క్రమంలో పరిష్కరిస్తామని తహసీల్దార్ పార్వతి చెప్పారు. తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా విజ్ఞప్తుల పరిష్కార వేదిక కార్యక్రమంలో భాగంగా అర్జీలు స్వీకరించారు. మొత్తం ఆరు అర్జీలు అందాయని తెలిపారు. వాటిలో కొలత కోసం 1, కేస్ట్ సర్టిఫికెట్ 1, స్థలం ఆక్రమణ 1, ఇందిరమ్మ గృహాలు డామేజీ 1, పెన్షన్ కోసం 1, దేవస్థాన స్థలం ఆక్రమణకు సంబంధించి 1 మొత్తం ఆరు అర్జీలు అందాయని వివరించారు. వాటిని పరిశీలించి నిర్ణీత కాలవ్యవధిలో పరిష్కరిస్తామని తహసీల్దార్ తెలిపారు. కార్యక్రమానికి పలుశాఖల అధికారులు గైర్హాజరయ్యారు.

ఎంపీడీవోకు సత్కారం



ఎంపీడీవోను సన్మానిస్తున్న ఉద్యోగులు

బల్లికురవ, ఆగస్టు 12 : ఎంపీడీవోగా పనిచేసి గుంటూరు జిల్లాకు బదిలీపై వెళుతున్న హనుమారెడ్డిని సోమవారం కార్యాలయ ఉద్యోగులు ఘనంగా సత్కరించారు. సార్వత్రిక ఎన్నికల విధులలో భాగంగా ఆయన గుంటూరు జిల్లా ఇక్కడకు వచ్చారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు తిరిగి గుంటూరు జిల్లాకు వెళుతుండగా కార్యాలయ ఉద్యోగులు ఆయనకు ఘన వీడ్కోలు పలికారు. కాగా బల్లికురవ ఎంపీడీవోగా కార్యాలయ ఏవో రాంబాబుకు బాధ్యతలు అప్పగించారు. కార్యక్రమంలో ఎంపీపీ శ్రీలక్ష్మి, ఈవోపీఆర్డీ సుమతి, సీనియర్ అసిస్టెంట్ సీహెచ్‌వై కోటేశ్వరరావు, (బుజ్జి) ఏఈ హనుమంతురావు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

చినగంజాం ఎంపీడీవోగా స్వరూపరాణి



అర్జీలను స్వీకరిస్తున్న తహసీల్దార్ పార్వతి

చినగంజాం, ఆగస్టు 12 : చినగంజాం మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా కే.స్వరూపరాణి సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఉమ్మడి గుంటూరు జిల్లా అమృతలూరులో పని చేస్తూ బదిలీపై చినగంజాం వచ్చారు. సార్వత్రిక ఎన్నికల సమయంలో ఆమె చినగంజాం నుంచి బదిలీపై అమృతలూరు వెళ్లారు. ఇన్‌చార్జి ఎంపీడీవోగా పని చేస్తున్న ఈవోపీఆర్డీ ఎన్.వేణుగోపాలకృష్ణమూర్తి నుంచి ఆమె బాధ్యతలు స్వీకరించారు. కార్యదర్శులు, కార్యాలయ సిబ్బంది ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు.

ఈ-పంట నమోదు పరిశీలన

మార్టూరు, ఆగస్టు 12 : మండలంలో జరుగుతున్న ఈ పంట నమోదు కార్యక్రమాన్ని సోమవారం ఏడీఏ కే శ్రీనివాసరావు, వ్యవసాయ అధికారి వీరగంధం కిరణ్ కుమార్ పరిశీలించారు. అందులో భాగంగా మార్టూరు గ్రామంలో లంబాడీ తాండాలో సూర్యానాయక్‌కు చెందిన మొక్కజొన్న పంట నమోదును వారు పరిశీలించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ కౌలు రైతులు వీఆర్‌వో ద్వారా కౌలు గుర్తింపు కార్డులను పొందాలని, అనంతరం కౌలు రైతు పేరుతో పంట నమోదు చేయించుకోవాలన్నారు. మండలంలోని రైతు భరోసా కేంద్రాలలో గత నాలుగురోజుల నుంచి ఈ పంట నమోదు కార్యక్రమం జరుగుతున్నదన్నారు. పంట నమోదు ఆధారంగానే ఇన్‌పుట్ సబ్సిడీ, క్రాప్ ఇన్సూరెన్స్, పంటలు కొనుగోలు మొదలైనవి అమలు చేస్తారన్నారు. కార్యక్రమంలో వీహెచ్‌ఏ సువర్చల, పలువురు రైతులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి ప్రణాళిక సిద్ధం చేయండి

సర్పంచ్‌లు, గ్రామ కార్యదర్శులకు ప్రారంభమైన మూడు రోజుల శిక్షణ



అద్దంకిలో మాట్లాడుతున్న పంచాయతీ కార్యదర్శి నాగేశ్వరరావు, ఇంకొల్లు, పంగులూరులో అవగాహన కల్పిస్తున్న అధికారులు

అద్దంకిటౌన్, ఆగస్టు 12 : గ్రామ పంచాయతీ పరిపాలనలో భాగంగా నిర్వహించాల్సిన విధులు, ప్రజా ప్రతినిధులు, అధికారులు చేయాల్సిన పనులపై అవగాహన ఉండాలని ఇన్‌చార్జి డీఎల్‌పీవో, ఈవోపీఆర్డీ డీ హనుమంతరావు తెలిపారు. సోమవారం అద్దంకి ఎంపీడీవో కార్యాలయంలోని సమావేశ హాలులో సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు ఆర్‌జీఎస్‌ఏ కార్యాచరణ ప్రణాళిక 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి మూడు రోజుల శిక్షణ కార్యక్రమం ప్రారంభమైంది. ముందుగా మహాత్మాగాంధీ, అంబేడ్కర్ చిత్రపటాలకు పూలమాలవేసి నివాళులర్పించారు. తొలిరోజు చక్రాయపాలెం, పేరాయపాలెం పంచాయతీ కార్యదర్శులు పి.నాగేశ్వరరావు, ఏ.నాగేశ్వరరావు పంచాయతీ రాజ్ చట్టం, విధులపై మాట్లాడారు. ప్రజల ఆరోగ్యం, పారిశుధ్యం, చెత్త సేకరణ, వర్మీకంపోస్టు తయారీ తదితర అంశాలు, డ్వాక్రా సంఘాలు, ప్రజల భాగస్వామ్యంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

బల్లికురవ, ఆగస్టు 12 : పరిసరాల పరిశుభ్రత పాటించి స్వచ్ఛ గ్రామాలుగా ఉండేలా ప్రతి ఒక్కరూ సహకరించాలని ఇన్‌చార్జి ఎంపీడీవో రాంబాబు కోరారు. సోమవారం ఎంపీడీవో కార్యాలయంలో శానిటేషన్, చెత్త సంపద కేంద్రాలపై పంచాయతీ సర్పంచ్‌లకు, కార్యదర్శులకు శిక్షణ ఇచ్చారు. ఈసందర్భంగా గ్రామాలలో పారిశుధ్యం మెరుగుదలకు చేపట్టాల్సిన చర్యలను వివరించారు. అనంతరం అధికారులు మాట్లాడుతు ప్రజా ప్రతినిధులు అధికారులు సీజనల్ వ్యాధుల నియంత్రణకు చర్యలు చేపట్టాలన్నారు. ప్రభుత్వం శానిటేషన్, చెత్త సంపద కేంద్రాలకు నిధులను విడుదల చేస్తుందని తెలిపారు. శిక్షణలో ఎంపీపీ శ్రీలక్ష్మి, ఈవోపీఆర్డీ సుమతి, పీ ఆర్ ఏఈ హనుమంతురావు, సీడీపీవో సుధ పాల్గొన్నారు.

పంగులూరు : గ్రామాల అభివృద్ధికి 100 రోజుల ప్రణాళికను సిద్ధం చేయాలని ఇన్‌చార్జి ఎంపీడీవో తానికొండ రమేష్‌బాబు సూచించారు. సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శుల మూడు రోజుల శిక్షణ కార్యక్రమం సోమవారం ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ తేళ్ల నాగమ్మ ప్రారంభించారు. ఈవోఆర్డీ రాంబాబు మాట్లాడుతూ పంచాయతీలలో ఏఏ పనులకు ఎంత నిధులు వినియోగించాలో శాఖా పరమైన నిబంధనలున్నాయని, వాటికి అనుగుణంగా ప్రణాళిక రూపొందించి, సంబంధిత అధికారుల ఆమోదం పొందాలన్నారు. కార్యక్రమంలో మండల పరిషత్ ఉపాధ్యక్షుడు ఎర్రం శ్రీనివాసరెడ్డి, పీఆర్ ఏఈ రామ్‌కుమార్, సర్పంచ్ గుడిపూడి నాగేంద్రం, పలు గ్రామాల సర్పంచ్‌లు, కార్యదర్శులు పాల్గొన్నారు.

పర్చూరు : అన్ని గ్రామాల్లోని ఎస్‌డబ్ల్యూపీసీ (డంపింగ్ యార్డు)లను వినియోగంలోకి తీసుకురావాలని ఎంపీడీవో ప్రత్యూష్కుమార్ సూచించారు. సోమవారం జరిగిన సర్పంచ్‌లు, కార్యదర్శుల శిక్షణ కార్యక్రమంలో గ్రామాలో క్లీన్ గ్రీన్ పనులను వివరించారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శులు, సర్పంచ్‌లు, అధికారులు పాల్గొన్నారు

ఇంకొల్లు : ఎంపీడీవో కార్యాలయంలో సర్పంచ్‌లు, కార్యదర్శులకు సోమవారం శిక్షణ ఇచ్చారు. ఇన్‌చార్జి ఎంపీడీవో, ఈవోఆర్డీ శ్రీనివాసరావు గ్రామపంచాయతీ అభివృద్ధి ప్రణాళికపై అవగాహన కల్పించారు. ఇంకొల్లు,దుద్దుకూరు, పావులూరు, ఇడుపులపాడు, పూసపాడు గ్రామ సర్పంచ్‌లతో సర్పంచ్‌లు, కార్యదర్శులు హాజరయ్యారు.

చినగంజాం : గ్రామ పంచాయతీలకు వచ్చే ఆదాయ మార్గాలపై దృష్టి పెట్టాలని శిక్షణ కోర్సు డైరెక్టర్ కే.స్వరూపరాణి, అసిస్టెంట్ డైరెక్టర్ ఎన్.వేణుగోపాలకృష్ణమూర్తి గ్రామ సర్పంచ్‌లు, గ్రామ కార్యదర్శులకు సూచించారు. ఎంపీడీవో కార్యాలయ సమావేశపు హాల్‌లో సర్పంచ్‌లు, గ్రామ కార్యదర్శులకు పలు అంశాలపై మూడు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని సోమవారం ప్రారంభించారు. మొదటి రోజు గ్రామ పంచాయతీల పరిపాలన, పారిశుధ్యం, చెత్త సంపద కేంద్రాల షెడ్లు, నిర్వహణ, గ్రామ పంచాయతీలను తనిఖీ చేసే అధికారులు, వారి విధులు తదితర విషయాలపై మండల రిసోర్సు పర్సన్‌లు ఎన్.సూర్యనారాయణ, ఎ.మస్తాన్‌రావు, నాగేంద్రబాబు, నారాయణ సర్పంచ్‌లకు, కార్యదర్శులకు శిక్షణ ఇచ్చారు. ఎంపీడీవో, ఈవోపీఆర్డీ, ఏపీవో, ఏపీఎం, పంచాయతీ రాజ్ ఏఈ, చినగంజాం పీహెచ్‌సీ వైద్యాధికారి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్‌లు పాల్గొన్నారు.

మార్టూరు : గ్రామ సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు పంచాయతీ విధులు, బాధ్యతలపై అవగాహన ఉన్నప్పుడే ప్రజా సమస్యలు పరిష్కరించగలరని ఎంపీడీవో జీనితిన్ అన్నారు. సోమారం సర్పంచ్‌లు, కార్యదర్శులకు ఎం పీడీవో కార్యాలయంలో జరిగిన శిక్షణ కార్యక్రమంలో ఎంపీడీవో, ఈవోఆర్డీ బొంతా సుబ్బారావు ప్రసగించారు.

గ్రావెల్ తవ్వకాలను నిలిపివేసిన మైనింగ్ అధికారులు

మార్టూరు, ఆగస్టు 12 : నాగరాజుపల్లి గ్రామ రెవెన్యూ పరిధిలో జరుగుతున్న గ్రావెల్ తవ్వకాలను సోమవారం మైనింగ్, రెవెన్యూ, ఫారెస్ట్ అధికారులు పరిశీలించారు. అనంతరం గ్రావెల్ తవ్వకాలను నిలిపివేయించారు. నాలుగు టిప్పర్లను అదుపులోకి తీసుకొని స్టేషన్‌కు తరలించారు. గ్రావెల్ తవ్వకాలు జరుగుతున్న భూములు అటవీ భూములు పరిధిలో లేవని ఫారెస్ట్ అధికారులు స్పష్టం చేశారు. అనంతరం ద్రోణాదులలో గ్రావెల్ కొండ ప్రాంతాన్ని మైనింగ్, రెవెన్యూ అధికారులు పరిశీలించారు. ఈ కొండలో గ్రావెల్ తవ్వకాలు జరగడంలేదని వెళ్లిపోయారు. కార్యక్రమంలో ఆర్‌డీవో గంధం రవీందర్, తహసీల్దార్ టి ప్రశాంతి, ఫారెస్ట్ అధికారులు జాన్సన్, రమేష్, మైనింగ్ అధికారులు పాల్గొన్నారు.



కేంద్రానికి సామగ్రిని అందజేస్తున్న దాత శ్రీనివాసరెడ్డి

అంగన్‌వాడీకి స్టీల్ సామగ్రి బహూకరణ

అద్దంకిటౌన్, ఆగస్టు 12: అద్దంకి పట్టణంలోని గౌడపాలెం అంగన్‌వాడీ కేంద్రానికి దాత శ్రీనివాసరెడ్డి కుక్కర్, స్టీల్ బిందె, గ్లాసులను బహూకరించారు. సోమవారం మండలంలోని మణికేశ్వరం గ్రామానికి చెందిన మాజీ మండల ఉపాధ్యక్షుడు ఈదా అంజిరెడ్డి 15వ వర్ధంతి సందర్భంగా కుమారుడు, మాజీ సర్పంచ్ ఈదా శ్రీనివాసరెడ్డి పట్టణంలోని గౌడపాలెం అంగన్‌వాడీ కేంద్రానికి కుక్కర్, స్టీలు బిందె, గ్లాసులు అందజేశారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు హుస్సేన్ బాషా, వెంకటేశ్వర రావు, టైల ర్ మీరావలి, అంగన్‌వాడీ టీచర్ పార్వతి పాల్గొన్నారు.



తిరుమలలో శ్రీ వేంకటేశ్వర స్వామిని మంత్రులు గొట్టిపాటి రవి కుమార్, అనగాని సత్యప్రసాద్ సోమవారం దర్శించుకున్నారు.

- అద్దంకి



సదస్సులో పాల్గొన్న డాక్టర్‌లు, పోలీస్ అధికారులు

హెచ్‌ఐవీపై అవగాహన అవసరం

మేదరమెట్ల, ఆగస్టు 12 : హెచ్‌ఐవీ, ఎయిడ్స్ వ్యాధిపై ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాలని మేదరమెట్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ నిఖిలారెడ్డి తెలిపారు. సోమవారం మేదరమెట్లలో ఎయిడ్స్ నివారణ సంస్థ, హెల్ప్ స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ నిఖిలారెడ్డి మత్తు పదార్థాల వాడకంతో కలిగే ఆరోగ్య సమస్యలను వివరించారు. పాఠశాలలు, కళాశాలలో, గ్రామ స్థాయి మహిళా మండలి సమావేశాలలో హెచ్‌ఐవీ, మాదకద్రవ్యాల దుష్ప్రభావాలను తెలియజేయాలన్నారు. వ్యాధి సోకిన వారి వివరాలు గోప్యంగా ఉంచాలని డాక్టర్ చిట్టిబాబు తెలిపారు. ప్రాజెక్టు డైరెక్టర్ బీవీ సాగర్ అధ్యక్షత వహించిన కార్యక్రమంలో అద్దంకి, మేదరమెట్ల, కొరిశపాడు మండలాల్లోని ఆశావర్కర్‌లు, ఏఎన్‌ఎంలు, డాక్టర్ హరికృష్ణ, డాక్టర్ మనోజ్, డాక్టర్ హర్ష, హెల్ప్ టీఐలు భార్గవ్, ఆరోగ్య సిబ్బంది, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన మైనార్టీ నాయకులు

చీరాలటౌన్, ఆగస్టు 12 : ఈపూరుపాలెంలో హత్య ఘటనపై ముస్లిం మైనార్టీ ప్రతినిధులు సోమవారం ప్రజావేదిక కార్యక్రమంలో కలెక్టర్ వెంకటమురళిని కలిశారు. ఘటనను స్వయంగా వివరించారు. అతి కిరాతకంగా హతుడు మృతిచెందినట్లు వేదన చెందారు. చీరాల్లో ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు చేట్టాలని విన్నవించారు. అంతేకాకుండా కేసు విచారణ పారదర్శకంగా జరగాలని కోరారు. అనంతరం ఎస్పీని కలిసిన నాయకులు మంగళవారం డీజీపీని కలిసేందుకు వెళుతున్నట్లు తెలిపారు.